08-08-2025, శుక్రవారం
TELTEL/2016/69862
# జనం పవర్
తెలుగు దినపత్రిక
సంపుటి: 10 | సంచిక:72 | వెల:05
JANAM POWER
EDITOR: BANDARI MARUTHI



# సంక్షోభంలో బీఆర్ఎస్

- కేసీఆర్ ను టార్గెట్ చేసిన కాంగ్రెస్
- కాళేశ్వరం నివేదిక బట్టబయలు
- కేసీఆర్ ఇమేజ్ డ్యామేజ్
- నిత్యం కూతురు విమర్శలు
- పార్టీని వీడుతున్న నేతలు
- బయటకు రాలేకపోతున్న కేసీఆర్
- పార్టీ క్యాడర్ లో నిరుత్సాహం
- బీజేపీ వైప మరికొందరు నేతల మొగ్గు

**జనం పవర్, హైదరాబాద్:**

తెలంగాణ రాజకీయాల్లో ఒకప్పుడు అజేయ శక్తిగా రాజ్యమేలిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఇప్పుడు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నివేదిక, పార్టీ అధినేత కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్)పై వచ్చిన ఆరోపణలు, కూతురు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు, నాయకుల బహిర్గతం, ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ తదితర అంశాలు బీఆర్ఎస్‌ను గందరగోళంలోకి నెట్టాయి. ఈ నేపథ్యంలో పార్టీ భవిష్యత్తుపై

..మిగతా 2లో

### కాంగ్రెస్ అధికారంలో ఉన్న
# ఏ రాష్ట్రంలోనైనా మళ్లీ గెలవండి



## గెలిస్తే మీరు ఏం చెప్తే అది చేస్తా
### రాహుల్ గాంధీకి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సవాల్

**జనం పవర్, హైదరాబాద్:**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఛాలెంజ్ విసిరారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలో అయినా మరలా గెలిస్తే.. తాను దేనికైనా సిద్ధం అని ఛాలెంజ్ చేశారు. కాంగ్రెస్ గెలిస్తే.. రాహుల్ ఏం చెప్పినా చేయడానికి తాను సిద్ధం అని చెప్పారు. కాంగ్రెస్ ఏ రాష్ట్రంలో తిరిగి వచ్చే అవకాశం లేదని, అడ్డంగా ఓడిపోవడం ఖాయం అని అన్నారు. సూర్యుడిపై ఉమ్మినట్లు.. ప్రధాని నరేంద్ర మోడీ గారిని కాంగ్రెస్ విమర్శిస్తోందని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మరణ శాసనం రాశారు అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పోరుబాట ధర్నాపై కిషన్ రెడ్డి

..మిగతా 2లో



## ప్రాణం తీసిన ఆన్లైన్ స్నేహం

ఇన్‌స్టాగ్రామ్‌లో యువతి మాట్లాడడం లేదని యువకుడి ఆత్మహత్య

2

## యూపీఐ సేవలు శాశ్వతంగా ఉచితమనలేదు

ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

3





2

## చేనేత దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

# మరోసారి అమెరికాకు పాకిస్థాన్ ఆర్మీ చీఫ్

- రెండు నెలల కాలంలో రెండో పర్యటన
- భారత్ కు భారీగా సుంకాలు విధించిన అమెరికా
- పాకిస్థాన్ కు మాత్రం స్వల్పంగానే..

3



## బలపడుతున్న భారత్–రష్యా బంధం

పారిశ్రామిక, సాంకేతిక రంగాల్లో కీలక ఒప్పందాలు

3



## గచ్చిబౌలిలో హెరాయిన్ స్వాధీనం



2



3

## తెలంగాణలో మూడు రోజులు భారీ వర్షాలు

వాతావరణ శాఖ హెచ్చరిక




## ఐర్లాండులో భారత సంతతి చిన్నారిపై లైంగికదాడి

3

## పేకాట రాయుళ్ల అరెస్ట్

విశాఖలో పోలీసుల అదుపులో ఆరుగురు మహిళలు

3

# చైనా పర్యటనకు ప్రధాని మోదీ

- ఎస్‌సీఓ శిఖరాగ్ర సమావేశానికి సిద్ధం
- ద్వైపాక్షిక చర్చలకు వేదిక కానుందని ఊహాగానాలు



**జనం పవర్, హైదరాబాద్:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 31న చైనాకు వెళ్లనున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆయన అక్కడ టియాంజిన్‌లో జరగబోయే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. 2019 తర్వాత మోదీ చైనాలో అడుగుపెట్టే ఇది తొలి పర్యటన కావడం విశేషం. ఈ నేపథ్యంలో ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. తూర్పు లడఖ్‌లో భారత్‌చైనా మధ్య నెలకొన్న సరిహద్దు ఉద్రిక్తతలు ఇంకా పూర్తిగా సద్దుమణగని ప్రస్తుత రాజకీయ వాతావరణంలో మోదీ పర్యటన అంతర్జాతీయంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. గల్వాన్ లోయ ఘర్షణ అనంతరం రెండు దేశాల మధ్య సంబంధాలు చల్లబడటంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా

..మిగతా 2లో



Contact: 96181 81112



కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలో జనం పవర్ పత్రికను ఎమ్మార్వో వాసంతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో వాసంతి మాట్లాడుతూ పత్రికలు సామాజిక జాగ్రతికి పాల్పడే ముఖ్యమైన వేదికలుగా నిలుస్తాయని, విలువలతో కూడిన మీడియా సేవల ద్వారా ప్రజలకు అవగాహన పెరుగుతోందని,పాత్రికేయులు సమాజానికి సేవ చేసే భాద్యతతో ముందుకు సాగాలంటూ ఆమె వ్యాఖ్యానించారు.

# ప్రాణం తీసిన ఆన్లైన్ స్నేహం

### ఇన్‌స్టాగ్రామ్‌లో యువతి మాట్లాడడం లేదని యువకుడి ఆత్మహత్య



**జనం పవర్, హైదరాబాద్:**

ఆన్‌లైన్ స్నేహం ఓ యువకుడి ప్రాణాన్ని తీసుకుంది. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఏర్పడిన పరిచయం.. కాస్త గొడవలతో విడిపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా దుబ్బాకకు చెందిన యువకుడి జీవితాన్ని విషాదంలోకి నెట్టింది. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన విఠల్, శాంతమ్మ దంపతుల చిన్న కుమారుడు సందీప్ (20) గత కొంత కాలంగా సూరారం రాజీవ్‌గాంధీనగర్‌లో నివసిస్తూ స్థానికంగా ఓ ప్రైవేట్ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇంటర్ వరకు చదువు పూర్తిచేసిన సందీప్, కొద్దిరోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా విజయవాడకు చెందిన ఓ యువతితో పరిచయం కలిగి ప్రేమగా మెలిగేవాడు. అయితే ఇటీవల ఈ యువతితో కొన్ని వ్యక్తిగత విషయాలపై గొడవలు జరిగాయి. దీంతో యువతి సందీప్‌తో మాట్లాడడం మానేసింది. ఈ వ్యవహారాన్ని మనస్సులో పెట్టుకున్న సందీప్ తీవ్ర మనోవేదనకు గురై.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.

# చేనేత దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు



**జనం పవర్, హైదరాబాద్:**

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేనేతలకు, నేత కార్మికులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మానవ నాగరికత పురోగతిలో చేనేతకు ప్రత్యేక స్థానం ఉందని, ఈ రంగాన్ని పునరుజ్జీవింపజేసేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేనేత కార్మిక కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్న రేవంత్ రెడ్డి, ఇప్పటికే పాత బకాయిలను విడుదల చేయడంతోపాటు, రూ. లక్ష వరకు ఉన్న రుణాలను మాఫీ చేసినట్లు తెలిపారు. అలాగే నేత కార్మికుల సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం "తెలంగాణ చేనేత అభయ హస్తం పథకం", "తెలంగాణ నేతన్న పొదుపు", "నేతన్న బీమా", "తెలంగాణ నేతన్నకు భరోసా" వంటి వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. ఇవన్నీ చేనేత రంగ పునరుజ్జీవానికి ఎంతో బలాన్నిస్తాయని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

# దాడులతో ధర్మస్థలాలకు కళంకం

### ధర్మస్థల ఘటనపై ప్రకాష్ రాజ్ ఆగ్రహం



**జనం పవర్, హైదరాబాద్:**

ధర్మస్థలలో విధులు నిర్వహిస్తున్న మీడియా ప్రతినిధులపై జరిగిన దాడిని ప్రముఖ సినీ నటుడు ప్రకాష్ రాజ్ తీవ్రంగా ఖండించారు. ఈ దాడికి సంబంధించి ఆయన ట్విటర్‌లో వీడియో పోస్టు చేస్తూ స్పందించారు. భక్తుల విశ్వాసానికి నిలయమైన ధర్మస్థల వంటి పవిత్ర ప్రదేశాల్లో గూండా చర్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ''ఇలాంటి దాడుల వల్లే ప్రజలు విశ్వసించే ధర్మస్థలాలకు కళంకం అంటుతుంది,'' అని అన్నారు. సౌజన్య దారుణ హత్యపై న్యాయం కోసం మీడియా మిత్రులు ప్రశ్నలు అడిగితే, నిందితులకు కోపం ఎందుకు వస్తుంది అని ప్రశ్నించారు ప్రకాష్ రాజ్. ''దయచేసి నిందితులను వెంటనే అరెస్టు చేయాలి. సత్యాన్ని వెలికితీసే ప్రయత్నాలు చేయాలి. మీడియాపై దాడులు మానాలి,'' అంటూ ఆయన స్పష్టంగా పేర్కొన్నారు. ఇటీవల సౌజన్య హత్య కేసులో న్యాయం కోరుతూ ధర్మస్థలలో మీడియా ప్రతినిధులు కవరేజ్ చేస్తుండగా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై ప్రక్షాళన కోసం ప్రశాంతంగా ఎదురుచూస్తున్న ప్రజల్లో ప్రకాష్ రాజ్ వ్యాఖ్యలు మరింత చైతన్యం నింపుతున్నాయి.

# సంక్షోభంలో బీఆర్ఎస్

మొదటి పేజీ తరువాయి



ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**కాళేశ్వరం నివేదిక: కేసీఆర్‌పై గురిపెట్టిన కాంగ్రెస్**

కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, బీఆర్ఎస్ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకం, ఇప్పుడు పార్టీకి తలనొప్పిగా మారింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ప్రాజెక్టులో భారీ ఆర్థిక, పరిపాలనా లోపాలను ఎత్తి చూపింది. ఈ నివేదిక కేసీఆర్‌ను నేరుగా బాధ్యుడిగా చూపిస్తూ, నిర్ణయాధికార ప్రక్రియలో ఏకపక్షత, కాంట్రాక్టులలో అవకతవకలు, నిపుణుల సలహాలను పట్టించుకోకపోవడం వంటి ఆరోపణలను మోపింది. ఈ నివేదికను "కాంగ్రెస్ కమిషన్"గా విమర్శిస్తూ బీఆర్ఎస్ నాయకులు దీటుగా స్పందించినప్పటికీ, ఈ ఆరోపణలు పార్టీ ఇమేజ్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి.

కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఈ నివేదికను ఆధారంగా చేసుకుని మరింత విచారణకు ఆదేశించే అవకాశం ఉంది. ఇది బీఆర్ఎస్‌పై ఒత్తిడిని మరింత పెంచనుంది. అయితే, బీఆర్ఎస్ ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీటి సౌకర్యం కల్పించిన 40 లక్షల ఎకరాలను హైలైట్ చేస్తూ, రాజకీయ కుట్రగా ఈ ఆరోపణలను కొట్టిపారేసే ప్రయత్నం చేస్తోంది.

**కవిత సంచలన ఆరోపణలు: కుటుంబంలో చీలిక, పార్టీలో గందరగోళం**

బీఆర్ఎస్‌లో సంక్షోభానికి మరో కారణం కల్వకుంట్ల కవిత ఆరోపణలు. కేసీఆర్ కూతురు, ఎమ్మెల్సీ అయిన కవిత, తన తండ్రి చుట్టూ ఉన్న "కుట్రకారుల"ను లక్ష్యంగా చేసుకుని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆమె రాసిన ఆరు పేజీల లేఖ, బహిరంగమైన తర్వాత, పార్టీలో అంతర్గత కలహాలు మరింత తీవ్రమయ్యాయి. కవిత, కేసీఆర్ నాయకత్వ శైలి, పార్టీలోని సంస్థాగత లోపాలు, బీజేపీతో సన్నిహితంగా ఉండటం వంటి అంశాలపై విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా, ఆమె జైలులో ఉన్న సమయంలో బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసే ప్రయత్నాలు జరిగాయని, దాన్ని తాను తిరస్కరించినట్లు ఆరోపించారు. కవిత ఆరోపణలు తన సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్)పై పరోక్షంగా సూచిస్తున్నాయని భావిస్తున్నారు. ఈ వివాదం కేసీఆర్ కుటుంబంలో చీలికను స్పష్టం చేసింది. కవిత, తనను పార్టీలో అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, తన లేఖ బహిర్గతం కావడం వెనుక పార్టీలోని కొందరు నాయకుల చేతివాటం ఉందని ఆరోపించారు. ఈ ఆరోపణలు బీఆర్ఎస్‌లో ఐక్యతను దెబ్బతీశాయి మరియు కేసీఆర్ నాయకత్వంపైనా ప్రశ్నలు లేవనెత్తాయి.

**నాయకుల బహిర్గతం: బీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బ**

బీఆర్ఎస్‌కు మరో పెద్ద ఎదురుదెబ్బ నాయకుల బహిర్గతం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత, పార్టీ నుంచి పలువురు కీలక నాయకులు కాంగ్రెస్ మరియు బీజేపీలో చేరారు. రాజ్యసభ సభ్యుడు కే. కేశవరావు, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, దానం నాగేందర్ వంటి సీనియర్ నాయకులు పార్టీని వీడారు. ఈ బహిర్గతాలు బీఆర్ఎస్ బలాన్ని 119 సభ్యుల అసెంబ్లీలో 39 నుంచి 28 సీట్లకు తగ్గించాయి. నాయకులు పార్టీని వీడటానికి కేసీఆర్ కుటుంబం ఆధిపత్యం, నిర్ణయాధికారంలో స్వేచ్ఛ లేకపోవడం, అందుబాటులో లేకపోవడం వంటి కారణాలను పేర్కొన్నారు. ఈ పరిస్థితి బీఆర్ఎస్ గ్రాస్‌రూట్ క్యాడర్‌లో నిరాశను పెంచింది మరియు పార్టీ బలహీనతను బయటపెట్టింది.

**ఫోన్ ట్యాపింగ్ కేసు: విచారణ తుది దశలో**

బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు పార్టీకి మరో సవాలుగా మారాయి. రాజకీయ నాయకులు, న్యాయమూర్తుల ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో విచారణ తుది దశకు చేరుకుంది, ఇది కేసీఆర్‌పై మరింత ఒత్తిడిని తెచ్చే అవకాశం ఉంది. ఆశ్చర్యకరంగా, కాంగ్రెస్ ఎంపీ చమల కిరణ్ కుమార్ రెడ్డి, కవిత ఫోన్‌ను కూడా కేటీఆర్ ట్యాప్ చేయించారని ఆరోపించారు, ఇది కుటుంబంలోని ఉద్రిక్తతలను మరింత బయటపెట్టింది.

**కేసీఆర్ మౌనం: వ్యూహమా, అసహాయతా?**

ఈ సంక్షోభ సమయంలో కేసీఆర్ మౌనంగా ఉండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో ఆయన నాయకులతో సుదీర్ఘ సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ, బహిరంగంగా స్పందించకపోవడం పార్టీ క్యాడర్‌లో అయోమయాన్ని సృష్టిస్తోంది. కొందరు దీనిని వ్యూహాత్మక మౌనంగా భావిస్తుండగా, మరికొందరు ఆయన అసహాయతగా చూస్తున్నారు.

**అనేక ఇబ్బందులు**

బీఆర్ఎస్ ప్రస్తుతం బహుముఖ సంక్షోభంలో చిక్కుకుంది. కాళేశ్వరం నివేదిక, కవిత ఆరోపణలు, నాయకుల బహిర్గతం, ఫోన్ ట్యాపింగ్ కేసు వంటి అంశాలు పార్టీని రక్షణాత్మక స్థితిలో నిలిపాయి. కేసీఆర్ నాయకత్వంలో పార్టీ ఈ సవాళ్లను అధిగమించగలదా లేక రాజకీయంగా మరింత బలహీనపడుతుందా అనేది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది. ప్రస్తుతానికి, తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ భవిష్యత్తు అనిశ్చితంగానే ఉంది.



# గచ్చిబౌలిలో హెరాయిన్ స్వాధీనం

**జనం పవర్, హైదరాబాద్:**

నగరంలోని గచ్చిబౌలి పరిధి ఖాజాగూడలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు హెరాయిన్‌ను పట్టుకున్నారు. ఇద్దరు నిందితుల నుంచి అధికారులు 66 గ్రాముల హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను బంగాల్ రాష్ట్రం మాల్దా ప్రాంతానికి చెందిన ఎండీ నూర్ అఖ్తర్(28), అజాత్ మెమిన్(32)గా గుర్తించారు. వీరు బంగాల్ నుంచి మాదకద్రవ్యాలను తెచ్చి నగరంలో విక్రయిస్తున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని శేరిలింగంపల్లి ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు

# కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనైనా మళ్లీ గెలవండి

మొదటి పేజీ తరువాయి



స్పందించారు. 'తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో రాకముందు నుంచే అబద్ధాలు చెప్పింది. అమలు కానీ హామిల్చింది. ఆరు గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీల పేరుతో ఆశ చూపించి ప్రజలను మోసం చేసింది. చేతకాని తనంతో చేతులు ఎత్తేసి.. ఇచ్చిన హామీలు అమలు చెయ్యలేని పరిస్థితిలో ఉన్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. తమ నిస్సహాయతను బీజేపీ, కేంద్రం, మోడీపై నెడుతున్నారు. తెలంగాణలో ఇచ్చిన హామీలకు రేవంత్ రెడ్డి మాత్రమే కాదు.. రాహుల్ గాంధీ, సోనియా గాంధీలు కూడా పూర్తి బాధ్యత వహించాలి. ఎన్నో డిక్లరేషన్‌ల పేరుతో ఆయా వర్గాలను మోసం చేశారు. అధికారంలోకి వచ్చాక, ఏ డిక్లరేషన్‌ను డెడికేషన్‌తో అమలు చెయ్యడం లేదు. బీసీలకు లక్ష కోట్లు ఇస్తాం అన్నారు.. ఎందుకు ఇవ్వలేదు. డిల్లీ బాట పట్టి స్థాయికి మించి విమర్శలు చేస్తున్నారు. డిల్లీ ప్రదక్షణ తప్ప.. తెలంగాణకు రేవంత్ చేసిందేమీ లేదు' అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. 'బీసీలకు ఇచ్చిన హామీల్లో ఏ హామీ కూడా అమలు చెయ్యడం లేదు. అద్దాల మేడలో కూర్చుని.. ఇతరుల మీద రాళ్ళు రువ్వే ప్రయత్నం చేస్తున్నారు. బీసీలకు సామాజిక సాధికారత కల్పించే ఆలోచన రేవంత్ రెడ్డికి లేదు. నిన్నటి ధర్నాలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను పొగడటం, మోదీని విమర్శించడానికే సరిపోయింది. రేవంత్ రెడ్డి ఎడాపెడా మాట్లాడేందుకు రేవంత్ ధర్నా. ధర్నాకు కాంగ్రెస్ పెద్దలు ఎందుకు రాలేదు. న్యాయబద్ధంగా, చట్టబద్దంగా, నిపుణులతో మాట్లాడి బీసీలకు ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్లు అమలు చెయ్యాలి. రేవంత్ రెడ్డి పాలనలో వైఫల్యం, రాజకీయంలో వైఫల్యం, హామీలు అమలు చెయ్యడంలో వైఫల్యం.. అవినీతిలో మాత్రం సక్సెస్ అయ్యారు. గత ప్రభుత్వ కేసీఆర్‌తో అవినీతిలో పోటీ పడుతున్నారు. అవినీతి, అప్పుల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. మజ్లిస్ పార్టీ కనుసైగలో ముస్లింలకు కేసీఆర్ రిజర్వేషన్లు ఇచ్చాడు. ఇపుడు రేవంత్, కాంగ్రెస్ కూడా 34 నుంచి 32కు కుదించే ప్రయత్నం చేస్తున్నారు. బీసీ జనాభా ప్రాతిపదికన 42 శాతం ఇవ్వడం లేదు. కులగణనలో తప్పులు చేశారు' అని కిషన్ రెడ్డి మండిపడ్డారు.

# చైనా పర్యటనకు ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి



మారే అవకాశముంది.

టియాంజిన్ నగరంలో ఎస్‌సీఓ సమావేశం...

ఈసారి ఎస్‌సీఓ శిఖరాగ్ర సమావేశం చైనాలోని టియాంజిన్ నగరంలో జరగనుంది. ఈ సమావేశంలో భారత్‌తో పాటు చైనా, రష్యా, పాకిస్తాన్, కజకిస్తాన్, కిర్గిజ్స్తాన్, ఉజ్బెకిస్తాన్, తజికిస్తాన్, ఇరాన్ దేశాల ప్రధానులు పాల్గొననున్నారు. మొత్తం ఎనిమిది సభ్య దేశాల నేతలు ఈ భేటీలో ఒకే వేదికపై కలుసుకోనున్నారు. ఈ సమావేశం ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించేందుకు, అంతర్‌దేశీ సహకారాన్ని బలోపేతం చేయడంలో కీలకంగా నిలిచే అవకాశం ఉంది. ముఖ్యంగా భారత్‌చైనా సంబంధాలు తిరిగి గాడిలో పడేందుకు ఇది వేదికగా మారవచ్చని నిపుణుల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**మోదీ–జిన్‌పింగ్ భేటీపై ఊహాగానాలు:**

ఈ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో వ్యక్తిగతంగా సమావేశం అవ్వనున్నారన్న వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. 2020లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణల తర్వాత ఈ ఇద్దరి మధ్య ప్రత్యక్ష సమావేశం జరగకపోవడం గమనార్హం. అయితే ఇటీవలే జీ20, బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికలపై తారసపడినప్పటికీ, మోదీజిన్‌పింగ్ మధ్య ప్రత్యేకంగా ఎటువంటి ద్వైపాక్షిక చర్చలు జరగలేదు. ఈసారి మాత్రం వారిద్దరూ సమావేశమై కీలక అంశాలపై చర్చించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా సమావేశంలో పాల్గొననున్నందున, భారత్‌చైనారష్యా మధ్య త్రైపాక్షిక చర్చలకు అవకాశాలు కనిపిస్తున్నాయి.

**చర్చకు వచ్చే ముఖ్యాంశాలు:**

విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఈ సమావేశంలో భారత్‌చైనా మధ్య ప్రత్యక్ష విమానాల పునఃప్రారంభం, వీసా సౌలభ్యం, సరిహద్దుల్లో సమాచార పంచిక వంటి కీలక అంశాలు చర్చకు వచ్చే అవకాశముందని తెలుస్తోంది. ముఖ్యంగా సరిహద్దు నదులకు సంబంధించిన డేటా షేరింగ్ అంశంపై చైనా ఇప్పటికే సానుకూలంగా స్పందించినట్టు సమాచారం. ఈ పర్యటనలో మోదీ ఇచ్చే సందేశం, జరగబోయే భేటీలు, చర్చలు – ఇవన్నీ భారత్ చుట్టూ ఏర్పడిన భౌగోళిక, దౌత్యపరమైన చక్రాలను ప్రభావితం చేయనున్నాయని చర్చ నడుస్తోంది.

# మరోసారి అమెరికాకు పాకిస్థాన్ ఆర్మీ చీఫ్

**2నెలల కాలంలో రెండో పర్యటన**

**భారత్ కు భారీగా సుంకాలు విధించిన అమెరికా**

**పాకిస్థాన్ కు మాత్రం స్వల్పంగానే..**

**జనం పవర్, హైదరాబాద్:**



పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ మరోసారి అగ్ర రాజ్యం అమెరికాకు వెళ్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. రెండు నెలల కాలంలో రెండో పర్యటనకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. సుంకాల విషయంలో భారత్అమెరికా మధ్య కొంత గ్యాప్ వచ్చింది. భారత్‌కు భారీగా సుంకాలు విధించగా.. పాకిస్థాన్‌కు మాత్రం స్వల్పంగా సుంకాలు విధించింది. దీంతో వాషింగ్టన్‌తో మరింత సంబంధాలు బలపరుచుకునేందుకు దాయాది దేశం పాక్ సిద్ధపడినట్లు సమాచారం. ఇందులో భాగంగా అసిమ్ మునీర్ మరోసారి అమెరికాకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పాకిస్థాన్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. రష్యా ముడి చమురును దిగుమతి చేసుకోవడంతో భారత్‌పై ట్రంప్ 50 శాతం సుంకం విధించారు. తొలుత 25 శాతం పెంచగా.. జరిమానాగా మరో 25 శాతం పెంచారు. దీంతో భారత ఎగుమతులపై 50 శాతం సుంకాన్ని ప్రకటించారు. రష్యా చమురు కొనుగోలు చేసే ఏ ఇతర దేశానికైనా ఇలాంటి పరిస్థితే ఉంటుందని ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. అయితే ఈ చర్యను భారత్ ఖండించింది. అన్యాయం.. అన్యాయం.. అసమంజసమైందిగా విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. భారత్అమెరికా మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో దీన్ని క్యాష్ చేసుకోవాలని పాకిస్థాన్ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే అసిమ్ మునీర్ మరోసారి అమెరికా వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు. గత జూన్‌లో అసిమ్ మునీర్‌కు వైట్‌హౌస్‌లో గౌరవ మర్యాదలు లభించాయి. ట్రంప్ ప్రత్యేక విందు ఇచ్చారు. ఆ సమయంలోనే మరోసారి అమెరికాకు వస్తానని అప్పుడే మునీర్ చెప్పినట్లుగా పాక్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇక అమెరికా పర్యటనలో ట్రంప్‌ను శాంతి బహుమతికి అసిమ్ మునీర్ మద్దతు తెలిపారు.

ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడి జరిగింది. అనంతరం పాకిస్థాన్‌పై భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. అనంతరం కాల్పుల విరమణకు తానే కారణం అంటూ ట్రంప్ ప్రకటించారు. అయితే ఈ ప్రకటనను భారత్ ఖండించింది. కాల్పుల విరమణకు మూడో వ్యక్తి ప్రమేయం లేదని.. ఇరు దేశాల చర్చల తర్వాతే కాల్పుల విరమణ జరిగిందని ఇటీవల పార్లమెంట్‌లో మోదీ ప్రకటించారు. మొత్తానికి అమెరికాతో ప్రస్తుతం భారత్‌కు గ్యాప్ పెరిగింది.



# బలపడుతున్న భారత్–రష్యా బంధం

**పారిశ్రామిక, సాంకేతిక రంగాల్లో కీలక ఒప్పందాలు**

**జనం పవర్, హైదరాబాద్:**

భారత్-రష్యా దేశాల మధ్య ఉన్న బంధం మరింత బలోపేతం అయ్యింది. న్యూఢిల్లీలో జరిగిన కీలక సమావేశంలో రెండు దేశాల ప్రతినిధులు పారిశ్రామిక సహకారం, ఆధునికీకరణ, సాంకేతిక మార్పిడి తదితర అంశాలపై సమగ్ర చర్చలు జరిపారు. ఈ సమావేశంలో అల్యూమినియం, ఎరువులు, రైల్వే, గనుల తవ్వకాలలో పరస్పర సహకారాన్ని అభివృద్ధి చేసేందుకు రెండు దేశాలు అంగీకరించాయి. ఈ లక్ష్యంతో కూడిన ప్రోటోకాల్‌పై భారత్, రష్యా అధికార ప్రతినిధులు సంయుక్తంగా సంతకాలు చేశారు. ప్రత్యేకంగా పరిశ్రమల ఆధునికీకరణ, ఉత్పత్తి సామర్థ్యాల పెంపు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలపై కూడా స్పష్టమైన విధానాలను రూపొందించుకునేందుకు ఈ సమావేశం దోహదపడినట్లు అధికారులు తెలిపారు. ఉభయ దేశాల మధ్య పారస్పర ఆసక్తి ఉన్న రంగాల్లో పెట్టుబడుల మార్పిడి, సాంకేతిక విజ్ఞానం పంచుకునే అంశాలపై ముందుగానే ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్-రష్యా సంబంధాలు మరింత బలపడతాయని, ప్రపంచ రాజకీయ పరిస్థితులలోనూ ఈ బంధం కీలకంగా మారుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# తెలంగాణలో 3రోజులు భారీ వర్షా లు



**వాతావరణ శాఖ హెచ్చరిక**

**జనం పవర్, హైదరాబాద్:**

ఉపరితల ఆవర్తనాలు, ద్రోణుల ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు మళ్లీ దండయాత్ర చేయనున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈరోజు (ఆగస్టు 7) నుంచి మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు రాష్ట్రంలోని పలుచోట్ల కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం కూడా ఉందని హెచ్చరించారు. గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వనపర్తి, జోగులాంబ గద్వాల, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో వర్షాలు పడే సూచనలు. ఆగస్టు 8న యాదాద్రి భువనగిరి, జనగామ, సిద్దిపేట, వికారాబాద్, నారాయణపేట, గద్వాల, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం. ఆగస్టు 9న కుమురం భీం, నిజామాబాద్, నిర్మల్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో వర్షాలు పడే సూచనలున్నాయన్నారు. వర్షాల ప్రభావంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వ్యవసాయ కార్యకలాపాల్లో పాల్గొనేవారు, రవాణా, గిరిజన ప్రాంతాల్లో నివసించేవారు వాతావరణ హెచ్చరికలపై దృష్టి పెట్టాలని కోరారు.

# సికింద్రాబాద్‌లో దారుణం..




**భార్య అసభ్యకర ఫొటోలు ఇన్‌స్టాలో పోస్టు చేసిన భర్త**

**జనం పవర్, హైదరాబాద్:**

సికింద్రాబాద్ రాంగోపాల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. పెళ్లయిన మూడు నెలలకే భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమె ఫొటోలు ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టి వేధింపులకు పాల్పడ్డాడు. రాంగోపాల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమ్ రాజ్, ఓ యువతి మూడు నెలల క్రితం ఆర్య సమాజ్‌లో వివాహం చేసుకున్నారు. మద్యానికి బానిసైన భీమ్‌రాజ్ కొన్ని రోజులుగా భార్యను వేధిస్తున్నాడు. ఆమెకు సంబంధించిన అసభ్యకరమైన ఫొటోలతో పాటు దుర్భాషలాడుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెట్టాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన యువతి పుట్టింటికి వచ్చి ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త భీమ్‌రాజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



## పేకాట రాణుల అరెస్ట్

**విశాఖలో పోలీసుల అదుపులో ఆరుగురు మహిళలు**

**జనం పవర్, హైదరాబాద్:**

విశాఖపట్నంలో గుట్టుచప్పుడు కాకుండా జూదం ఆడుతున్న ఆరుగురు మహిళలను పోలీసులు పట్టుకున్నారు. లలితానగర్ ప్రాంతంలో మహిళలు జూదంలో పాల్గొంటున్నారన్న సమాచారంతో నాలుగో పట్టణ పోలీసులు టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఆరుగురు మహిళలను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.22,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇటీవలి కాలంలో మహిళలు కూడా జూదక్రీడల్లో పాల్పడటం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

# ఐర్లాండులో భారత సంతతి చిన్నారిపై లైంగికదాడి

**జనం పవర్, హైదరాబాద్:**



ఐర్లాండ్‌లో భారత పౌరులపై ఇటీవల భౌతిక దాడులు పెరిగిపోతున్నాయి. తాజాగా ఆరేళ్ల చిన్నారి జాత్యహంకార దాడికి గురైంది. చిన్నారి ముఖంతో పాటు ఆమె వ్యక్తిగత అవయవాలపై కూడా కొందరు దుండగులు కొట్టారు. ప్రస్తుతం ఈ ఘటన తీవ్ర ఆందోళన రేకెత్తిస్తుంది. అసలేం జరిగిందంటే..

భారత సంతతికి చెందిన బాధిత బాలిక కుటుంబం గత ఎనిమిదేళ్లుగా ఐర్లాండ్‌లో నివసిస్తున్నారు. ఇటీవల వీరికి ఐరిష్ పౌరసత్వం లభించింది. నర్సుగా పనిచేస్తున్న చిన్నారి తల్లి అక్కడి మీడియాతో జరిగిన ఘటన గురించి వెల్లడించారు. ఈనెల 4న తన కుమార్తె మరికొంతమందితో కలిసి ఇంటి బయట ఆడుకుంటుండగా ఇది జరిగిందన్నారు. 1214 మధ్య వయసున్న కొంతమంది అబ్బాయిలు ఆమెపై దాడి చేశారని వెల్లడించారు. ''భారత్‌కు తిరిగి వెళ్లిపో'' అంటూ జాత్యహంకార దూషణలు చేశారని వివరించారు.

ముఖంపై కొట్టడంతో పాటు ఆమె వ్యక్తిగత అవయవాలపై కూడా దాడి చేశారన్నారు. వెంటనే ఇంట్లోకి పరిగెత్తుకొని వచ్చిన ఆమె ఏడుస్తూ ఉండిపోయిందన్నారు. ఈ ఘటనతో తను చాలా భయపడిపోయిందన్నారు. తన 10నెలల కుమారుడికి ఇంట్లో ఆహారం తినిపిస్తుండగా ఇదంతా జరిగిందన్నారు. తమకు ఇక్కడ సురక్షితంగా అనిపించడం లేదని ఆమె వాపోయారు. ఈ ఘటన తమను తీవ్రంగా కలచి వేసిందని, కుమార్తెపై దాడి జరగకుండా ఆపలేకపోయానని తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై ఫిర్యాదు చేశానని, అయితే వారికి శిక్ష విధించడం కంటే కౌన్సిలింగ్ ఇవ్వాలని కోరినట్లు ఆమె తెలిపారు.

ఇటీవల ఐర్లాండ్‌లో భారతీయులపై జాత్యహంకార దాడులు జరగడం తీవ్ర కలకలం రేపుతోంది. జులై 19న డబ్లిన్ శివారులోని తల్లాగ్‌ట్‌లో డాక్టర్ సంతోష్ యాదవ్ అనే భారత పౌరుడిపై కొందరు స్థానిక యువకులు జాత్యహంకార దూషణలు చేస్తూ దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ దాడి ఘటనపై కేసు నమోదు చేసిన ఐర్లాండ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే, ఈ ఘటన షాక్‌కు గురిచేసిందని ఐర్లాండ్‌లోని భారత రాయబారి అఖిలేశ్ మిశ్రా అప్పట్లో స్పందించారు. మరోవైపు.. ఈ దాడుల నేపథ్యంలో ఐర్లాండ్‌లోని భారత రాయబార కార్యాలయం ఇటీవల కీలక అడ్వైజరీ జారీ చేసింది. ప్రతికూల సమయాల్లో నిర్జన ప్రదేశాలకు వెళ్లొద్దని, భద్రతాపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

# పులివెందులలో ఉద్రిక్తతలపై కేసుల పర్వం



**వైసీపీ,టీడీపీ నేతలపై పోలీసుల చర్యలు**

**జనం పవర్, హైదరాబాద్:**

కడప జిల్లా పులివెందుల మండలంలో చోటు చేసుకున్న రాజకీయ ఉద్రిక్తతలు కేసుల వరకు వెళ్లాయి. ఇటీవల నల్లగొండ వారి పల్లెలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలపై తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని ఆరోపణల నేపథ్యంలో పోలీసులు తీవ్రంగా స్పందించారు. వైసీపీ నాయకుడు వేముల రాము ఇచ్చిన ఫిర్యాదులో, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌తో కలిసి తనపై టీడీపీ కార్యకర్తలు కార్లతో ఢీకొని, అనంతరం కర్రలతో దాడి చేశారని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన పులివెందుల పోలీసులు, టీడీపీ నేతలు 25 మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో టీడీపీ పులివెందుల ఇన్‌చార్జ్ బీటెక్ రవి తమ్ముడు భరత్ రెడ్డితో పాటు ఇతర 24 మందిని నిందితులుగా పేర్కొన్నారు. ఈ కేసులో నాన్‌బెయిలబుల్ సెక్షన్లు కూడా నమోదు చేసినట్లు సమాచారం. ఇక మరోవైపు, వైసీపీ నేతలపై కూడా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ధనుంజయ అనే వ్యక్తి చేసిన ఫిర్యాదులో, అదే గ్రామానికి చెందిన వైసీపీ నేతలు వేముల రాము, హేమాద్రి తనను కులపరంగా దూషించారనే ఆరోపణలతో కేసు నమోదు అయింది. ఇవన్నీ కొనసాగుతుండగానే, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన కేసులో కూడా మరొక కేసు నమోదు అయింది. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ సతీష్ రెడ్డి, ఇంకా వేరే 8 మంది వైసీపీ నాయకులపై కూడా కేసులు నమోదయ్యాయి. ఎంపీడీవో ఇచ్చిన ఫిర్యాదులో, ఎలక్షన్ కోడ్ అమలులో ఉండగానే అనుమతులు లేకుండా ర్యాలీ నిర్వహించారని ఆరోపించారు. ఈ మూడు విభిన్న కేసులతో పులివెందులలో రాజకీయ పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. అధికార, ప్రతిపక్ష పార్టీలపై చట్టపరమైన చర్యలు కొనసాగుతుండగా, స్థానిక ఎన్నికల వేళ ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యే అవకాశముంది.



# యూపీఐ సేవలు శాశ్వతంగా ఉచితమనలేదు

**ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా**

**జనం పవర్, హైదరాబాద్:**

యూపీఐ సేవలు ఎప్పటికీ ఉచితంగా ఉంటాయన్న ప్రచారంపై ఆర్‌బీఐ డెప్యూటీ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టత ఇచ్చారు. యూపీఐ సేవలపై వాస్తవాలు వక్రీకరించబడుతున్నాయని ఆయన తెలిపారు. తాను ఇంతకు ముందు చెప్పిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు. "యూపీఐ లావాదేవీలపై ఖర్చులు ఉంటాయి. వాటిని ఎవరో ఒకరు భరించాల్సిందే. వినియోగదారుల నుంచి ఛార్జీలు వసూలు చేయకపోయినా, ప్రస్తుతం వాటిని ప్రభుత్వం సబ్సిడీల రూపంలో భరిస్తోంది," అని మల్హోత్రా వివరించారు. చెల్లింపుల వ్యవస్థ కొనసాగడం కోసం పెట్టే ఖర్చులను దేనో ఒక రూపంలో భరించాల్సిన అవసరం తప్పదని స్పష్టం చేశారు.

**ప్రస్తుత పరిస్థితి ఇలా ఉంది:**

యూపీఐ చెల్లింపులపై వినియోగదారుల నుంచి ఛార్జీలు వసూలు చేయడం లేదు. ప్రభుత్వమే ప్రస్తుతం వాటిపై ఖర్చును భరిస్తోంది. యూపీఐ సేవల విస్తరణే ప్రభుత్వ ప్రాధాన్యంగా ఉంది. అయితే యూపీఐ సేవల ఉచితతపై భవిష్యత్‌లో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారన్నది కేంద్ర ప్రభుత్వ పాలసీ ఆధారంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పరిశీలించదగిన అంశం ఏమిటంటే, యూపీఐ చెల్లింపులు రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో, సాంకేతిక మౌలిక వసతుల నిర్వహణ, సేవల నాణ్యత పరిరక్షణకు స్థిరమైన ఆదాయ మార్గాలపై ఆర్బీఐ, కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి.

# జస్టిస్ వర్మ పిటిషన్ కొట్టివేత..!

### సుప్రీంకోర్టులో చుక్కెదురు

**జనం పవర్, హైదరాబాద్:**

తన ఇంట్లో భారీ మొత్తంలో లెక్కలో లేని సొమ్ము బయటపడిన కేసులో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తనపై నిర్వహించిన అంతర్గత దర్యాప్తు నివేదికను సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టేసింది. భారీ మొత్తంలో నగదు బయటపడటంతో ఆయన్ను తొలగించాలని సదరు నివేదిక సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ వర్మ పక్షాన వాదనలు వినిపించేందుకు సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ముకుల్ రోహత్గి హాజరయ్యారు.



తాజాగా సుప్రీంకోర్టు నిర్ణయంతో పార్లమెంట్‌లో ఆయనపై అభిశంసన చేపట్టేందుకు మార్గం సుగమమైంది. జస్టిస్ వర్మను విధుల నుంచి తొలగించాలని నాటి సీజేఐ సంజీవ్‌ఖన్నా రాష్ట్రపతి, ప్రధానికి సిఫార్స్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా జస్టిస్ వర్మ పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, ఏజీ మాషితో కూడిన ధర్మాసనం వాదనలు విన్నది. అనంతరం జస్టిస్ వర్మ పిటిషన్‌ను సమర్థించలేమని తేల్చిచెప్పింది. ఆయన అంతర్గత కమిటీ విచారణలో పాల్గొన్న తీరు, ఆ తర్వాత అసలు కమిటీ సామర్థ్యాన్ని ప్రశ్నించడాన్ని తాము పరిగణనలోకి తీసుకొన్నట్లు పేర్కొంది. ఆయన రిట్ పిటిషనే విచారణకు అనర్హమని తేల్చింది. నాటి చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా, ఆయన ఏర్పాటుచేసిన అంతర్గత కమిటీ ఒక్క ఫొటోలు, వీడియోల అప్‌లోడ్ విషయంలో తప్పించి.. మిగిలిన అంశాల్లో చట్టాన్ని పూర్తిగా అనుసరించారని తేల్చిచెప్పింది. ఇక ఫొటోలు, వీడియోల విషయాన్ని జస్టిస్ వర్మ పిటిషన్ అభ్యంతరం చెప్పకపోవడంతో.. దానిని పట్టించుకోమని బెంచ్ పేర్కొంది. ఇక అదే సమయంలో జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ న్యాయవాది మాథ్యూ దాఖలు చేసిన ఓ రిట్ పిటిషన్‌ను కూడా కొట్టేసింది.

**ఏంటీ వివాదం..**

ఈ ఏడాది మార్చి 14న దిల్లీలోని జస్టిస్ యశ్వంత్‌వర్మ అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం చోటుచేసుకోగా.. ఈ ఘటనలో భారీ మొత్తంలో కాలిన నోట్ల కట్టలు బయటపడటం కలకలం రేపింది. ఈ ఘటన అనంతరం మార్చి 28న సుప్రీంకోర్టు కొలీజియం జస్టిస్ యశ్వంత్‌వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసి.. ఆయనకు ఎలాంటి న్యాయపరమైన బాధ్యతలు అప్పగించొద్దని సూచించింది. నోట్ల కట్టల ఘటనపై సుప్రీంకోర్టు ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీని నియమించింది. ఈ కమిటీ దీనిపై విచారణ జరిపి నివేదిక సమర్పించింది.

అందులో.. డబ్బు బయటపడిన మాట వాస్తవమేనని నిర్ధరించింది. ఆ సొమ్ములున్న స్టోర్‌రూమ్ నియంత్రణ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జస్టిస్ వర్మ లేదా అతని కుటుంబసభ్యుల అధీనంలోనే ఉందని పేర్కొంది. దీనికి సంబంధించి బలమైన ఆధారాలు ఉన్నట్లు వెల్లడించింది. అసలు ఈ నోట్లను జస్టిస్ వర్మ లేదా ఆయన కుటుంబసభ్యుల స్టోరూమ్‌లో ఉంచడం అనుమానాస్పదంగా ఉందని అభిప్రాయపడింది. కాలిపోయిన నోట్లు చిన్న నోట్లు లేదా తక్కువ మొత్తం కాదని వెల్లడించింది. అలహాబాద్ హైకోర్టు జస్టిస్‌గా ఉన్న వర్మను విధుల నుంచి తొలగించడానికి ఈ ఆధారాలు సరిపోతాయని కమిటీ అభిప్రాయపడింది.



# కిషన్‌రెడ్డి లాంటి వారి కుట్రలు సాగనివ్వం: మంత్రి పొన్నం

**జనం పవర్, హైదరాబాద్:**

బీసీ రిజర్వేషన్ల కోసం తుదివరకు పోరాడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. గాంధేయ పద్ధతిలో పోరాడి అనుకున్నది సాధిస్తామన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లాంటి వారి కుట్రలను సాగనివ్వమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా చావుతప్పి కన్నులొట్టబోయిన చందంగా.. గెలిచిందని ఎద్దేవా చేశారు. ఉత్తరాదిలో చాలా రాష్ట్రాల్లో బీసీలు ఆ పార్టీని తిరస్కరించారని చెప్పారు. రిజర్వేషన్లు పెంచకుంటే వచ్చే ఎన్నికల్లో భాజపా ఓటమి ఖాయమని పేర్కొన్నారు. ‘‘శాసనసభలో బీసీ బిల్లుపై తీర్మానం సందర్భంలో కిషన్‌రెడ్డి దానికి వ్యతిరేకంగా అభిప్రాయం చెప్పిఉంటే ఆరోజే చర్చ జరిగేది. కానీ ఆ బిల్లు చట్టం రూపంలో మారి గవర్నర్ ఆమోదంతో దిల్లీకి వచ్చిన తర్వాత మీరు ముస్లింల పేరుతో ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడం సరికాదు. మిమ్మల్ని బహిరంగ చర్చకు కూడా ఆహ్వానించదల్చుకున్నా. మా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. కామారెడ్డి డిక్లరేషన్ నుంచి జంతర్ మంతర్ ధర్నా వరకు మేం బాధ్యతగా ఉన్నాం’’ అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.



# ఆ దేశాల నుంచి బిలియన్ డాలర్లు వెనక్కొస్తాయి : ట్రంప్

**జనం పవర్, హైదరాబాద్:**

భారత్‌తో సహా పలు దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అదనపు సుంకాలు నేటి నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ క్రమంలో తన చర్యను సమర్థించుకుంటూ ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. యూఎస్ నుంచి ప్రయోజనాలు పొందిన దేశాల నుంచి బిలియన్ డాలర్లు తిరిగి వెనక్కి రానున్నాయి అని రాసుకొచ్చారు .

పరస్పర సుంకాలు నేటినుంచి అమల్లోకి వస్తాయని ట్రంప్ పేర్కొన్నారు. ఏళ్ల తరబడి కొన్ని దేశాలు అమెరికా నుంచి ప్రయోజనం పొందాయన్నారు. ఆ దేశాల నుంచి ఇప్పుడు యూఎస్‌కు బిలియన్ డాలర్లు తరలిరానున్నాయని వ్యాఖ్యానించారు. అమెరికా గొప్పతనాన్ని అడ్డుకునేది అతివాద వామపక్ష కోర్టులేనని వ్యాఖ్యానించారు. ఇటీవల ఒక్కో దేశానికి ఒక్కో విధమైన సుంకాలను విధించారు ట్రంప్. ‘ప్రతీకార సుంకాల్లో మరిన్ని మార్పులు’ పేరుతో దాదాపు 70 దేశాలపై ఉన్న సుంకాలను పెంచారు. 10% నుంచి 41% వరకు సుంకాలు విధించే కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. సిరియాపై అత్యధికంగా 41శాతం టారిఫ్‌ను విధించారు. బ్రెజిల్‌పై ఇప్పటికే ఉన్న 10 శాతం సుంకాలకు అదనంగా 40 శాతం కలిపారు. పాకిస్థాన్‌కు మాత్రం 29% నుంచి 19 శాతానికి తగ్గించారు. ఇక, రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంగా భారత్‌పై 25శాతం టారిఫ్ విధించారు. దీన్ని 50శాతానికి పెంచుతూ బుధవారం కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేశారు. అదనపు 25% సుంకాలు ఈనెల 27 నుంచి అమల్లోకి రానున్నాయి.

# అమెరికాపైనా ప్రతీకార సుంకాలు విధించాలి: శశిథరూర్



**జనం పవర్, హైదరాబాద్:**

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50శాతం సుంకాలు విధించడాన్ని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తీవ్రంగా తప్పుబట్టారు. అమెరికా దిగుమతులపై కూడా భారత ప్రభుత్వం అలాంటి చర్యలే తీసుకోవాలన్నారు. గురువారం పార్లమెంటు వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. అమెరికా విధించిన సుంకాలు మనపై కచ్చితంగా ప్రభావం చూపిస్తాయన్నారు. దాదాపు 90 బిలియన్ డాలర్ల మేర ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. సుంకం ఎక్కువగా ఉన్నప్పుడు భారత్ వస్తువులు ఎందుకు కొనాలి అని కొనుగోలుదారులు కూడా ఆలోచిస్తారన్నారు. రష్యా నుంచి భారత్ కంటే చైనా ఎక్కువ చమురు కొనుగోలు చేస్తోందని.. కానీ, ఆ దేశానికి ట్రంప్ సుంకాల నుంచి 90 రోజుల ఉపశమనం కల్పించారన్నారు. మనకు మాత్రం మూడు వారాలే ఉపశమనం కల్పించడం సమంజసం కాదన్నారు. కేంద్రం కూడా యూఎస్ దిగుమతులపై 50శాతం సుంకం విధించాలని కోరారు. మరే దేశం కూడా మనపై ఇలా బెదిరింపులకు దిగకూడదన్నారు. ఇప్పటికే భారత్‌పై 25శాతం సుంకాలు విధించిన ట్రంప్ దాన్ని 50శాతానికి పెంచారు. అంతకు ముందు ప్రకటించిన పాత 25శాతం సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. కొత్తగా విధించిన 25శాతం టారిఫ్‌లు ఈనెల 27 నుంచి అమల్లోకి రానున్నాయి. భారతీయ వస్త్ర పరిశ్రమ, ఆక్వా రంగం, తోలు ఉత్పత్తులపై ఇది వెంటనే ప్రభావం చూపనుంది. ట్రంప్ విధించిన సుంకాలపై ప్రధాని మోదీ మాట్లాడుతూ.. రైతుల ప్రయోజనాలపై ఎన్నటికీ రాజీపడే ప్రసక్తే లేదన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడటం కోసం వ్యక్తిగతంగా ఎంత చెల్లించేందుకైనా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

# నేను మోదీకి ఫోన్ చేస్తా

### ట్రంప్‌నకు బ్రెజిల్ అధ్యక్షుడి సమాధానం

**జనం పవర్, హైదరాబాద్:**

‘సమస్యల పరిష్కారంపై చర్చల కోసం ఎప్పుడైనా కాల్ చేయొచ్చు’ అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన ఆఫర్‌ను బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా తిరస్కరించారు. ట్రంప్ చర్చలకు సిద్ధంగా లేరని.. ఆయనకు, రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు తప్ప మోదీ, జిన్‌పింగ్ సహా ఇతర దేశాధినేతలు ఎవరితోనైనా ఫోన్‌లో మాట్లాడుతానని లూలా డా సిల్వా బుధవారం వెల్లడించారు. బ్రసీలియాలో డిసిల్వా మాట్లాడుతూ ‘‘మా ప్రయోజనాలను కాపాడుకొనేందుకు ప్రపంచ వాణిజ్య సంస్థ మొదలు అన్ని అవకాశాలనూ వినియోగిస్తాం. విదేశీ వాణిజ్యాన్ని బలోపేతం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అమెరికాలో కొత్త ప్రభుత్వం రాగానే.. దేశీయ కంపెనీలకు కొత్త అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నాం’’ అని లూలా డా సిల్వా పేర్కొన్నారు. ఈ ఏడాది బ్రెజిల్‌లో కాప్ 30 సదస్సు జరగనుంది. విభేదాలను పక్కన పెట్టి ఈ కార్యక్రమానికి ట్రంప్‌ను ఆహ్వానిస్తానని డిసిల్వా చెప్పారు. కాగా, తన మిత్రుడు, మాజీ అధ్యక్షుడు జైరో బోల్సొనారోపై బ్రెజిల్ ప్రభుత్వం దర్యాప్తు చేపట్టడాన్ని ట్రంప్ తప్పుపట్టారు. బ్రెజిల్‌పై అత్యధికంగా 50 శాతం సుంకాలు విధించారు. దీంతో రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి.

# రాజీపడే ప్రసక్తే లేదు..

### ట్రంప్ టారిఫ్‌ల వేళ మోదీ స్ట్రాంగ్ మెసేజ్

**జనం పవర్, హైదరాబాద్:**



రష్యా చమురును కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై సుంకాలను రెట్టింపు చేశారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ఇప్పటివరకు ఉన్న 25శాతం సుంకాలను 50శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈ పరిణామాలపై భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరోక్షంగా స్పందించారు. రైతుల ప్రయోజనాలపై ఎన్నటికీ రాజీపడే ప్రసక్తే లేదంటూ అమెరికాను ఉద్దేశిస్తూ గట్టిగా బదులిచ్చారు. దివంగత వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్ స్వామినాథన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని దిల్లీలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమెరికాతో వాణిజ్యం, టారిఫ్‌ల అంశాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. ‘‘రైతుల సంక్షేమమే మాకు అత్యంత ప్రాధాన్యం. రైతులు, మత్స్యకారులు, పాడి రైతుల ప్రయోజనాలకు సంబంధించిన విషయాల్లో ఎన్నటికీ రాజీపడబోం. అలా చేయడం వల్ల మేం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మాకు తెలుసు. రైతుల ప్రయోజనాలను కాపాడటం కోసం వ్యక్తిగతంగా ఎంత చెల్లించేందుకైనా నేను సిద్ధమే. భారత్ సిద్ధమే’’ అని మోదీ వ్యాఖ్యానించారు. భారత్‌పై ఇప్పటికే 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్ .. తాజాగా దాన్ని 50 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. అంతకుముందు ప్రకటించిన పాత 25శాతం సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. ఇక, కొత్తగా విధించిన అదనపు 25% సుంకాలను ఈ నెల 27 నుంచి అమలు చేస్తామని ట్రంప్ ప్రకటించారు. ఈ టారిఫ్‌లతో భారతీయ వస్త్ర పరిశ్రమ, ఆక్వా రంగం, తోలు ఉత్పత్తులపై వెంటనే ప్రభావం పడనుంది. ముఖ్యంగా రొయ్యలు, జంతు సంబంధ ఉత్పత్తులపై అదనపు భారం పడింది. మన దేశం నుంచి ఎగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తుల పై సుంకాలు తగ్గించాలని అమెరికా చాలాకాలంగా డిమాండ్ చేస్తోంది. అందుకు ఆమోదిస్తే.. దేశంలోని రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయనే ఆందోళన ఉంది. ఇది రాజకీయంగా సున్నితమైన అంశం అయినందున.. వ్యవసాయ ఉత్పత్తులపై సుంకం మినహాయింపునకు భారత్ ససేమిరా అంది. గతంలోనూ ఈ విషయంపై ఇరు దేశాల మధ్య పలుమార్లు చర్చలు జరిగినా ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో అగ్రరాజ్యం ఆగ్రహించినట్లు తెలుస్తోంది. మరోవైపు, రష్యా నుంచి న్యూదిల్లీ చమురు కొనుగోలును కూడా అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలోనే భారత్‌పై సుంకాలను రెట్టింపు చేసింది.

# అమెరికాలో యాపిల్ 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి..!

**జనం పవర్, హైదరాబాద్:**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశాలపై ఇష్టం వచ్చినట్లు పన్నులు విధిస్తున్న వేళ.. టెక్ దిగ్గజం యాపిల్ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. దీనిలోభాగంగా అమెరికాలో అదనంగా మరో 100 బిలియన్ డాలర్లు (రూ.8.7లక్షల కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ సొమ్ముతో దేశీయంగా పంపిణీ వ్యవస్థ గొలుసుకట్టును అభివృద్ధి చేసుకోనున్నట్లు పేర్కొంది. యాపిల్ భారత్‌లో ఉత్పత్తి పెంచుతోందని ఇటీవల కాలంలో ట్రంప్ గుర్రుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ విషయంపై శ్వేతసౌధం ప్రతినిధి టైలర్ రోజర్స్ మాట్లాడుతూ ‘‘నేడు యాపిల్‌తో కలిసి చేస్తున్న ఈ ప్రకటన మా తయారీరంగానికి అతిపెద్ద విజయం. అమెరికా ఆర్థిక, జాతీయభద్రత ప్రయోజనాలను కాపాడేలా కీలక పరికరాలు దేశీయంగా ఉత్పత్తి చేయడానికి ఉపయోగపడుతుంది’’ అని పేర్కొన్నారు. తాజా ప్రకటనతో అమెరికాలో యాపిల్ పెట్టుబడి వాగ్దానాల విలువ 600 బిలియన్ డాలర్లకు చేరుతుంది. గతంలో ఆ కంపెనీ 500 బిలియన్ డాలర్లకు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.



భారత్‌లో ఉత్పత్తిని పెంచాలని యాపిల్ తీసుకొన్న నిర్ణయంలో కొంత ఇబ్బంది ఉందని ఈ ఏడాది ప్రారంభంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఇక ఖతార్‌లో ఆయన ఓ సమావేశంలో పాల్గొన్న వేళ ఈ మాటలను సీఈవో టిమ్‌కుక్ ముఖం మీదే ట్రంప్ చెప్పారు. భారత్‌లో తయారీని కొనసాగిస్తామని ఇటీవల యాపిల్ సీఈవో టిమ్ కుక్ ఎర్నింగ్ కాల్ సందర్భంగా వెల్లడించారు.

కానీ, ట్రంప్ భారత్‌పై అదనంగా 25 శాతం పన్ను విధించిన రోజే యాపిల్ నిర్ణయం వెలువడటం గమనార్హం. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లను కొనసాగిస్తోందని ట్రంప్ ఆరోపిస్తూ ఈ పన్నులు విధించిన విషయం తెలిసిందే. కొత్త టారిఫ్‌లు మరో 21 రోజుల్లో అమల్లోకి రానున్నాయి. దీంతో భారత్‌పై అమెరికా విధించిన పన్నుల శాతం 50కు చేరింది.

ట్రంప్‌నకు ప్రత్యేక గిఫ్ట్..

యాపిల్ సీఈవో టిమ్‌కుక్ బుధవారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ప్రత్యేకమైన గిఫ్ట్‌ను బహూకరించారు. ప్రత్యేకంగా యాపిల్ గుర్తు ఉన్న ఓ గాజు ఫలకాన్ని 24 క్యారెట్ల బంగారం బేస్‌పై ఉంచిన ప్రతిమను అందజేశారు. ఈ గాజు గుర్తును అమెరికా మెరైన్ కోర్‌లో పనిచేసిన యాపిల్ ఉద్యోగి ఒకరు రూపొందించారని టిమ్ కుక్ పేర్కొన్నారు.

# 20వేల డాలర్లు చెల్లిస్తే గ్రీన్‌కార్డ్

జనం పవర్, హైదరాబాద్:

అమెరికాలో శాశ్వత నివాసం కోసం జారీ చేసే గ్రీన్ కార్డు లను పొందడం కోసం భారత్ సహా చైనా, మెక్సికో, ఫిలిప్పీన్స్ దేశస్థులు ఏళ్లతరబడి నిరీక్షించాల్సి వస్తుంది. దానికి చెక్ పెట్టేలా ఓ షార్ట్‌కట్ మార్గాన్ని అమెరికా ప్రభుత్వం ప్రతిపాదించింది. గ్రీన్‌కార్డు కోసం 10 ఏళ్లుగా ఎదురుచూస్తున్నవారు 20 వేల డాలర్లు (రూ.17.5 లక్షలు) చెల్లిస్తే త్వరగా వారి దరఖాస్తును పరిశీలించే అవకాశాన్ని ఆ ప్రతిపాదిత బిల్లులో పేర్కొంది. డిగ్నిటీ యాక్ట్ ఆఫ్ 2025 పేరిట ఆ బిల్లును తీసుకువచ్చారు. ''దశాబ్దాలుగా నలుగుతోన్న సమస్యకు పరిష్కారం చూపేందుకు ఈ బిల్లును ప్రవేశపెట్టాం'' అని చట్టసభ సభ్యురాలు మారియా ఎల్విరా సలజార్ పేర్కొన్నారు. ఇమిగ్రేషన్ చట్టాల ప్రకారం అమెరికా ఏటా.. 2,26,000 ఫ్యామిలీ ప్రిఫరెన్స్, 1,40,000 ఉపాధి ఆధారిత గ్రీన్ కార్డు లను జారీ చేసేందుకు వీలుంటుంది. ఈ 20వేల డాలర్ల ప్రీమియం ప్రాసెసింగ్ ఫీ ద్వారా గ్రీన్ కార్డ్ బ్యాక్‌లాగ్‌లను క్లియర్ చేయడమే లక్ష్యంగా పె




ట్టుకున్నారు. ఉపాధి కోసం అగ్రరాజ్యానికి వెళ్లి అక్కడే శాశ్వతంగా స్థిరపడాలనుకునే వలసదారులకు అమెరికా పర్మినెంట్ రెసిడెంట్ కార్డ్ (గ్రీన్ కార్డు)లను ఇస్తుంటుంది. అయితే, ఒక్కో దేశానికి నిర్ణీత సంఖ్య (కోటా)లో మాత్రమే వీటిని జారీ చేస్తుంటారు. మొత్తం దరఖాస్తుల్లో ఒక్కో దేశానికి కేవలం 7% మాత్రమే కేటాయించాలన్నది ప్రస్తుత విధానం అయితే ఈ బిల్లులో దానిని 15 శాతానికి పెంచారు. అలాగే అమెరికాకు వర్క్‌పర్మిట్‌పై వచ్చిన దంపతుల పిల్లలు (డ్రీమర్ల)కు శాశ్వత నివాస హోదా పొందడానికి ఈ ప్రతిపాదిత బిల్లు వీలు కల్పిస్తుంది. కాగా.. భారత్, చైనా, మెక్సికో, ఫిలిప్పీన్స్ వంటి దేశాల నుంచి గ్రీన్ కార్డుల కోసం విపరీతమైన పోటీ ఉంటుంది. ఏటా లక్షల మంది వీటి కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. దేశాలవారీ కోటా కారణంగానే.. వారు శాశ్వత నివాస పత్రాల కోసం ఏళ్లతరబడి ఎదురుచూడాల్సి వస్తుంది. ఒకపక్క కార్డుల జారీపై కోటాను స్థిరంగా ఉంచగా.. డిమాండ్ మాత్రం ఏటేటా పెరుగుతూ వస్తోంది. ఇటీవల యూఎస్‌సీఐఎస్ ప్రచురించిన డేటాషీట్ ప్రకారం.. అమెరికాలో ఇమిగ్రేషన్ బ్యాక్‌లాగ్‌లో 1.13 కోట్ల దరఖాస్తులున్నాయి. ఈ స్థాయిలో పెండింగ్‌లో ఉండటం ఓ రికార్డ్. రానురానూ ఆ సంఖ్య పెరుగుతూనే ఉంది. గతేడాది 3.3 మిలియన్ల దరఖాస్తులను ప్రాసెస్ చేయగా.. ఈసారి 2.7 మిలియన్లకే పరిమితమైంది.

# సాంకేతిక లోపం.. అమెరికాలో నిలిచిపోయిన విమానాలు

జనం పవర్, హైదరాబాద్:

సాంకేతిక లోపంతో అమెరికా లో యునైటెడ్ ఎయిర్‌లైన్స్ కు చెందిన విమాన సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో వేలాది మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లోనే పడిగాపులు కాశారు. సాంకేతిక సమస్య కారణంగానే విమాన సర్వీసులు నిలిచిపోయాయని అధికారులు పేర్కొన్నారు. సమస్య పరిష్కరించేలోగా మరిన్ని సర్వీసులు ఆలస్యమయ్యే అవకాశం ఉందన్నారు. షికాగో, డెన్వర్, న్యూఆర్క్, హ్యూస్టన్, శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఎయిర్‌పోర్ట్‌లలో విమాన కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఈ సమస్య పరిష్కరించామని, సాధారణ కార్యకలాపాల పునరుద్ధరణకు తమ బృందం కృషి చేస్తుందని యునైటెడ్ ఎయిర్‌లైన్స్ ప్రతినిధి ఆ తర్వాత ఓ వార్తా సంస్థతో తెలిపారు.

అయితే, ఇది సైబర్ దాడి కాదని ఎయిర్‌లైన్స్ ధ్రువీకరించింది. సమస్యకు గల కచ్చితమైన కారణాన్ని మాత్రం వెల్లడించలేదు. దీని కారణంగా



827 విమానాలు ఆలస్యంగా నడిచాయి. మరో 23 విమానాలు రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలువురు సామాజిక మాధ్యమాల వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. గత నెలలో అలస్కా ఎయిర్‌లైన్స్ ఇలాంటి సాంకేతిక సమస్యనే ఎదుర్కొంది. కొన్ని గంటల సేపు ఆ సంస్థ విమానాలు నిలిచిపోయాయి.



## 2 లక్షల పింఛన్లు రద్దు చేశారు

### మాజీ మంత్రి హరీశ్‌రావు

జనం పవర్, హైదరాబాద్:

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2 లక్షల పింఛన్లను రద్దు చేసిందని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. పింఛను మొత్తం రూ.4వేలకు పెంచుతామని ఇంకా పెంచలేదని ఆయన విమర్శించారు. చంద్రబాబుకు గురుదక్షిణగా గోదావరి జలాలను తరలిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. కన్నేపల్లి పంపులను ఆన్‌చేస్తే అన్ని ప్రాజెక్టులు నిండుతాయన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ధర్నా చేస్తే కేసులు పెట్టారన్నారు.



# ఇప్పుడు ఆ అవకాశం కూడా లేకపాయే

### ట్రంప్ టారిఫ్‌లపై కాంగ్రెస్ వ్యాఖ్యలు

జనం పవర్, హైదరాబాద్:

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మన దేశంపై సుంకాల మోత మోగించారు. ఇదంతా ప్రధాని నరేంద్రమోదీ అనుసరిస్తోన్న విదేశాంగ విధానం వైఫల్యం వల్లేనని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు. '' ఈ వైఫల్యానికి కూడా 70 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ కారణమని నిందించే అవకాశం వారికి లేకుండా పోయింది'' అని ఎద్దేవా చేశారు. 1971 యుద్ధంలో పాక్‌కు మద్దతుగా అమెరికా తన సెవెంత్ ఫ్లీట్‌ను బంగాళాఖాతంలోకి పంపిన విషయం తెలిసిందే. నాడు సోవియట్ మద్దతు భారత్‌కు ఉండటంతో.. అమెరికా ఎత్తులు పారలేదు. అలాగే అణు పరీక్షల తర్వాత మన దేశంపై అమెరికా ఆంక్షలు విధించింది. దానిని తాజాగా ఖర్గే ప్రస్తావించారు. అప్పుడు భారత ప్రభుత్వం ఆత్మగౌరవంతో యూఎస్‌తో సంబంధాలను నెరిపిందన్నారు. కానీ ఇప్పుడు దౌత్యవిధానం దారుణంగా పతనమైందని ధ్వజమెత్తారు. ఇక, 50 శాతం సుంకాలు అమల్లోకి వస్తే.. భారత ఆర్థిక వ్యవస్థపై రూ.3.75 లక్షల కోట్ల భారం పడుతుందని అంచనా వేశారు. దీనివల్ల చిన్న పరిశ్రమలు, వ్యవసాయం, ఫార్మా, వస్త్ర పరిశ్రమలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తంచేశారు. భారత్ దిగుమతులపై ఇప్పటికే 25% సుంకాలను విధించిన ట్రంప్ దానిని 50 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రధాని మోదీ పరోక్షంగా స్పందించారు. ''రైతుల ప్రయోజనాలపై ఎన్నటికీ రాజీపడే ప్రసక్తే లేదంటూ అమెరికాను ఉద్దేశిస్తూ గట్టిగా బదులిచ్చారు. ''రైతుల సంక్షేమమే మాకు అత్యంత ప్రాధాన్యం. రైతులు, మత్స్యకారులు, పాడి రైతుల ప్రయోజనాలకు సంబంధించిన విషయాల్లో ఎన్నటికీ రాజీపడబోం. అలా చేయడం వల్ల మేం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మాకు తెలుసు. రైతుల ప్రయోజనాలను కాపాడటం కోసం వ్యక్తిగతంగా ఎంత చెల్లించేందుకైనా నేను సిద్ధమే'' అని మోదీ అన్నారు.

# రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీరియస్



### ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్న పీసీసీ క్రమశిక్షణ కమిటీ

జనం పవర్, హైదరాబాద్:

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలను పీసీసీ క్రమశిక్షణ కమిటీ తీవ్రంగా పరిగణిస్తోంది. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి ఇవాళ రాజగోపాల్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడనున్నారు. తరచూ సీఎం రేవంత్‌పై వ్యాఖ్యలు చేస్తున్నారని, ఆయన వ్యాఖ్యల వల్ల ప్రభుత్వానికి, పార్టీకి నష్టం కలుగుతోందని క్రమశిక్షణ కమిటీ భావిస్తోంది.

**రాజగోపాల్‌రెడ్డి ఏమన్నారంటే?**

ఎల్బీనగర్ నుంచి పోటీ చేస్తే మంత్రి పదవి వచ్చేదని.. కానీ, నియోజకవర్గ ప్రజల కోసమే మునుగోడు నుంచి పోటీ చేసినట్లు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. తనకు పదవి వస్తే అది ప్రజలకే ఉపయోగపడుతుందని.. అందరిలా పైరవీలు చేస్తూ దోచుకునేవాడిని కాదని వ్యాఖ్యానించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి కావాలా?మునుగోడు ప్రజలు కావాలా? అంటే మునుగోడు ప్రజలే కావాలని కోరుకుంటానన్నారు.

''పార్టీలో చేరినప్పుడు మంత్రి పదవి ఇస్తామన్నారు. పదవులను అడ్డుపెట్టుకుని సంపాదించేవాడిని కాదు. నా స్వార్థం కోసం మంత్రి పదవిని అడగటం లేదు. మంత్రినైతే మంచి జరుగుతుందని మునుగోడు ప్రజలు భావిస్తున్నారు. భువనగిరి ఎంపీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామన్నారు. పదవి ఇస్తారా? ఇవ్వరా? అనేది పార్టీ అధిష్ఠానం ఇష్టం. ఇతర పార్టీల నుంచి వచ్చిన వాళ్లకు, నా జూనియర్లకు కూడా ఇచ్చారు. ఎవరి కాళ్లో మొక్కి పదవి తెచ్చుకోవాలనుకోవట్లేదు. దిగజారి బతకడం నాకు తెలియదు. మళ్లీ త్యాగానికైనా సిద్ధం.. ఎంత దూరమైనా మునుగోడు ప్రజల కోసం వెళ్తా. నా నియోజకవర్గ ప్రజలు తలదించుకునే పని ఏనాడూ చేయను'' అని అన్నారు.

# బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుకు 3 మార్గాలు

### సీఎం రేవంత్‌రెడ్డి

జనం పవర్, హైదరాబాద్:

బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు కోసం పోరాడుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బిల్లును రాష్ట్రపతి ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నామన్నారు. ''రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోసం సాయంత్రం వరకు వేచి చూస్తాం. రాష్ట్రపతి స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నాం. ఆమె సమయం ఇవ్వలేదంటే ప్రధాని ఒత్తిడి చేసినట్టు భావించాల్సి ఉంటుంది. 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఉన్న మార్గాలన్నింటిని ప్రయత్నించాం. కుదరనప్పుడు ప్రత్యామ్నాయ మార్గాల్లో స్థానిక ఎన్నికలకు వెళ్లాలి. బీసీ రిజర్వేషన్ల అమలుకు మా వద్ద 3 మార్గాలు ఉన్నాయి. 50శాతం సీలింగ్‌పై గత ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని పక్కన పెట్టి జీవో ఇవ్వాలి. జీవో ఇస్తే.. ఎవరైనా కోర్టుకు వెళ్తే స్టే వస్తుంది. కాబట్టి జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లే మొదటి మార్గం సాధ్యం కాదు. ఇప్పుడే స్థానిక ఎన్నికలు పెట్టకుండా ఆపడం రెండో మార్గం. స్థానిక ఎన్నికలు ఆపితే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగుతాయి. కేంద్ర నిధులు రాకుంటే గ్రామాల్లో వ్యవస్థలు కుప్పకూలుతాయి. మూడో మార్గం పార్టీ పరంగా బీసీలకు 42శాతం సీట్లు ఇవ్వడం. బీసీలకు 42శాతం సీట్లపై ఇతర పార్టీలపైనా ఒత్తిడి తెస్తాం'' అని సీఎం తెలిపారు.

# ఆ ఒక్క నియోజకవర్గంలోనే లక్ష నకిలీ ఓట్లు!



### - రాహుల్ ఆరోపణలు

జనం పవర్, హైదరాబాద్:

కేంద్ర ఎన్నికల సంఘం పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. అనేక రాష్ట్రాల ఓటర్ల జాబితాలో నకిలీ వ్యక్తుల పేర్లు ఉన్నాయని ఆరోపించారు. ఎగ్జిట్ పోల్స్, ఒపీనియన్ పోల్స్‌కు వ్యతిరేకంగా ఎన్నికల ఫలితాలు వస్తున్నాయని, హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ఫలితాలు తమ అనుమానాలకు బలం చేకూర్చాయని చెప్పారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని ఆరోపించిన ఆయన.. ఇందుకు సంబంధించి మీడియా సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలో ఐదు నెలల్లోనే 40 లక్షల మంది ఓటర్లు నమోదయ్యారు. ఐదేళ్లలో నమోదైన వారి కంటే.. ఐదు నెలల్లో నమోదైన ఓటర్లే ఎక్కువ. మహారాష్ట్రలో లోక్‌సభ, విధానసభ ఎన్నికల మధ్య సమయంలో కోటి మంది ఓటర్లు నమోదయ్యారు. ఓటర్ల జాబితా మాకు ఇచ్చేందుకు ఈసీ నిరాకరించింది. అది దేశ సంపద.. దానిని ఎందుకు చూపించట్లేదు అని రాహుల్ ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయన్న తమ అనుమానం మహారాష్ట్ర ఫలితాలతో నిజమైందన్నారు. మెషిన్ రీడ్ చేయగల ఓటరు లిస్టును ఎన్నికల సంఘం ఇవ్వకపోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తోందన్నారు. అటు కర్ణాటకలోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో 6.5లక్షల ఓట్లకుగాను లక్ష ఓట్లు నకిలీవి, తప్పుడు చిరునామావేనని తమ పరిశోధనలో తేలిందని చెప్పారు.

# డంకీ రూట్‌లో అమెరికాకు.. ఇద్దరు భారతీయుల అరెస్ట్

జనం పవర్, హైదరాబాద్:

డంకీ రూట్‌లో అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించి ఇద్దరు భారతీయులు అరెస్టయ్యారు. మెనే రాష్ట్రంలోని బ్రిడ్జ్‌వాటర్‌లో గల అమెరికాకెనడా సరిహద్దుల్లో వీరిని బోర్డర్ పెట్రోలింగ్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం వారు కస్టడీలో ఉన్నారని, చట్టపరమైన చర్యలు చేపట్టి వారిని దేశం నుంచి పంపించేస్తామని అధికారులు వెల్లడించారు.

అయితే, అరెస్టయిన వారి వివరాలు మాత్రం ఇంకా తెలియరాలేదు. వీరు కాలినడకన సరిహద్దుకు చేరుకొని అక్కడి నుంచి అమెరికాలోకి ప్రవేశించేందుకు యత్నించినట్లు బోర్డర్ పెట్రోలింగ్ సిబ్బంది వెల్లడించారు. సాధారణంగా ఈ ప్రాంతంలో అక్రమ చొరబాట్లు చాలా తక్కువగా జరుగుతుంటాయి. అయినప్పటికీ.. అమెరికా కఠిన విధానాల్లో భాగంగా ఇటీవల సరిహద్దుల్లో గస్తీని పెంచిన సంగతి తెలిసిందే.

ఈ క్రమంలోనే గతవారం మెనే బోర్డ్ పెట్రోలింగ్ సిబ్బంది 16 మంది అక్రమ వలసదారులను అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు భారతీయులు కాగా.. 13 మంది రొమేనియా పౌరులు, ఒక కొలంబియా దేశస్థుడు ఉన్నారు. ఇటీవల కాలంలో అమెరికాలోకి అక్రమ చొరబాట్లు తగ్గాయని అధికారులు పేర్కొన్నారు. అక్రమ వలసదారులపై ట్రంప్ సర్కారు కఠినవైఖరి అనుసరిస్తోన్న సంగతి తెలిసిందే. సరైన పత్రాలు లేకుండా అమెరికాలో ఉంటున్న వారిని అరెస్టు చేసి స్వదేశాలకు తిరిగి పంపిస్తున్నారు. అలా గత ఆరు నెలల్లో దాదాపు 1700 మంది భారతీయులను వెనక్కి పంపించారు.



# నేత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తా





### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 7:** నేత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హామీ ఇచ్చారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ నుండి కలెక్టరేట్ వరకు గురువారం ప్రదర్శన నిర్వహించారు. అదనపుకలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఈ ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని చేనేత కార్మికులకోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయిస్తామని అన్నారు. ప్రతి కార్మికునికి ఆరోగ్య కార్డు అందించి సంవత్సరంలో నాలుగు సార్లు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కంటి పరీక్షలు చేయించి అవసరమైన వారికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యశ్రీ ద్వారా పది లక్షల రూపాయల ఉచిత వైద్య సహాయాన్ని కూడా పొందవచ్చని తెలిపారు.
ఆరోగ్య మహిళా కార్యక్రమంలో చేనేత మహిళా కార్మికులు ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా లభించే బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి మాత్రలు తీసుకోవాలని అన్నారు. నేత కార్మికులు కోరిన రుణాలు, గురుకులాల్లో వారి పిల్లలకు సీట్ల కేటాయింపు వంటి అంశాలను ప్రభుత్వానికి విన్నవిస్తామని అన్నారు. నేత కార్మికుల్లో అర్హులైన వారికి కచ్చితంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. అనంతరం జిల్లా నుండి చేనేత పురస్కారాలు అందుకున్న పలువురు నేత కార్మికులను కలెక్టర్ సన్మానించారు. చేనేత కార్మిక సంఘాలకు రుణాల మంజూరు చెక్కులు అందజేశారు.
కలెక్టరేట్ ఆడిటోరియం వద్ద ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శనను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు విద్యాసాగర్, పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షులు వాసాల రమేష్, వివిధ చేనేత సహకార సంఘాల అధ్యక్షులు, పద్మశాలి సంఘం నాయకులు, నేత కార్మికులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నిర్మూలనకు ఏర్పాట్లు

**జనం పవర్, జమ్మికుంట, ఆగస్టు 7:** జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డిప్యూటీ డీఎంహెచ్ఓ డా చందు తెలిపారు. మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని19 సంవత్సరాల వయసు వారికి అల్బెండజోలు మాత్రలు వేస్తామని, 11వ తేదిన వేసుకొని పిల్లలకు 18వ తేదీన వేస్తామని తెలిపారు.



## బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**జనం పవర్, మాదుగులపల్లి, ఆగస్టు 7:** మండలంలోని చిరుమర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ క్రియాశీలక నాయకులు మోదుగు సత్తిరెడ్డి, కొండా యల్లయ్య, మోదుగు జైపాల్‌రెడ్డిలు ఇటీవల అనారోగ్యమునకు గురయ్యారు. స్థానిక నాయకత్వం ద్వారా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు చిరుమర్తికి చేరుకొని వారి ఇంటికి వెళ్లి పరామర్శించి వారి ఆరోగ్య క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట మండల పార్టీ అధ్యక్షులు పాలుట్ల బాబయ్య, నాయకులు కూరెళ్ళ వెంకట చారి, నక్క సైదులు, నాగాచారి, తండుమహేష్, లింగరాజు, జబ్బార్, నాతల కరుణాకర్ రెడ్డి, పొరెడ్డి నాగిరెడ్డి, అవిరెండ్ల వెంకన్న, గుమ్మరి సందీప్, కొండా భరత్, నక్కల ఉపేందర్, మల్లోజు చంద్రమౌళి, వద్ది ఉపేందర్, వద్ది రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## 'మంథనిలో మెరుగైన వైద్య సేవలు'



**జనం పవర్, మంథని, ఆగస్టు 7:** మంథని పట్టణం లోని రేనే హాస్పిటల్‌లో పిడియాట్రిక్ వైద్య సేవలు గురు వారం నుండి అందుబాటులోని వచ్చాయనిబీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి తెలిపారు. ప్రతి మంగళ, గురువారం అందుబాటులో ఉంటారని సునీల్ రెడ్డి తెలియజేశారు. మారుమూల ప్రాంతల ప్రజ లకు మరిన్ని వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో పిడియాట్రిక్ విభాగం అందిస్తున్నామని అన్నారు. మంథని ప్రాంతంలో చిన్నపిల్లల వైద్యం కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని మంథనిలోని రేనే హాస్పిటల్‌లో ప్రముఖ పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ సత్యం బాబును తీసుకున్నారు. రెనీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ బంగారి స్వామి యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. అనంతరం గోదావరిఖని వైద్యులు డాక్టర్ సత్యం బాబు మాట్లాడుతూ ఇక్కడి వైద్యసేవలు మంథని చుట్టూ పక్కల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలి

### బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి నారాయణ




**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 7 :** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు మార్గ నిర్దేశం మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీ కృష్ణ గార్డెన్స్‌లో విభజన గాయాల స్మృతి దినం హర్ ఘర్ తిరంగా తిరంగా యాత్రలపై తిరంగా యాత్ర కార్యక్రమ జిల్లా కన్వీనర్ పెద్దిరాజు అధ్యక్షతన జిల్లాస్థాయి కార్యశాల నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షులు డి నారాయణ మాట్లాడుతూ హర్ ఘర్‌తిరంగా అభియాన్‌లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటున్నారని పేద ధనిక చిన్న పెద్ద అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్నారు. ఘర్ ఘర్ తిరంగా అనేది మన త్రివర్ణ పతాక వైభవాన్ని ఇనుబడింపజేసే ఒక ప్రత్యేక పండుగగా మారిందని తాజాగా జరిగిన మన్‌కీ బాత్‌లో నరేంద్ర మోడీ ప్రశంసించారని, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దృఢమైనసంకల్పం నిర్ణయాత్మక నాయకత్వానికి సాయుధ దళాల ధైర్యసహసాలు దేశ ప్రజల ఉమ్మడి ఆకాంక్షల తోడవడంతో ఆపరేషన్ సింధూర్ గొప్ప విజయం సాధించిందన్నారు. ప్రధాని మోదీ పార్లమెంటులో ఇది భారతదేశం విజయోత్సవానికి ఆత్మగౌరవానికి సంబంధించిన సెషన్ ఉగ్రవాదుల ప్రధాన కార్యాలయాన్ని నేలమట్టం చేసినందుకు మన సింధూర్ శబదం నెరవేరినందుకు జరిపే విజయోత్సవ వేడుకలు భారత సాయుధ దళాల శౌర్య పరాక్రమాలకు సంబంధించినవి అని పేర్కొనడం జరిగిందని ప్రధానమంత్రి కేంద్ర మంత్రుల విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. జిల్లా స్థాయి కార్యాశాలలో జిల్లా అధ్యక్షులు డి నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబిరెడ్డి వెంకట్ రెడ్డి, కేతూరి బుద్దన్న, అభియాన్ కన్వీనర్ పెద్దిరాజు, మోర్చాల రాష్ట్ర నాయకులు జ్యోతి రమణ, పి అలివేలమ్మ, సహ కన్వీనర్లు కదిరే మధు, బాసెట్టి శీను, అశ్విని రాధా, జిల్లా ఉపాధ్యక్షులు బి కుమారస్వామి, సుమిత్రమ్మ, విష్ణు వర్ధన్ రెడ్డి, అధికార ప్రతినిధులు తిరుమలేష్, మని వర్ధన్ సాగర్, గోర్ల బాబురావు, కార్యదర్శి బోయిళ్ళ, రామ్మోహన్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, మోర్చాల జిల్లా అధ్యక్షులు రాఘవేందర్ గౌడ్, ఎండిఖలీల్, గంధం ప్రవీణ్, వెంకట్రాం రెడ్డి, వారణాసి కల్పన, మండల అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, సంద వెంకటేష్, ముప్పూరి చెన్నయ్య, బుచ్చిబాబు గౌడ్, తిరుపతి రెడ్డి, బాలునాయక్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

## ఘనంగా ఆదివరాహ స్వామి జయంతి



**జనం పవర్, కమాన్‌పూర్ ఆగస్టు 7:** కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ప్రసిద్ధ ఆదివరాహ స్వామి దేవాలయంలో జయంతి ఉత్సవాల చివరి రోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుండి స్వామి వారికి నిత్యాభిషేకం, గోపూజలు చేశారు. తదనంతరం వరాహ జయంతిని పురస్కరించుకుని అష్టోత్తర శతఘటాభిషేక మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. 108 పవిత్ర కళశాలతో స్వామివారికి ఘటాభిషేకం నిర్వహించడం విశేషం. ఆదివరాహ స్వామివారికి భక్తులు సమర్పించిన వెండి కవచాన్ని అలంకరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధాన అర్చకులు వరప్రసాదాచార్యులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. ఈ పవిత్ర కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో శ్రీ కే. కాంతా రెడ్డి, కమాన్‌పూర్ మండల తహసీల్దార్ శ్రీమతి వాసంతి, ఆర్ఐ స్రవంతి, ఎస్సై శ్రీ కొట్టే ప్రసాద్, పలువురు ప్రజా ప్రతినిధులు, భక్తజనం పెద్దఎత్తున పాల్గొన్నారు.

## వర్షాలు కురవాలని ముస్లిం సోదరుల ప్రత్యేక నమాజు



**జనం పవర్, మంథని, ఆగస్టు 7:** మంథని పట్టణంలోని ముస్లిం మైనారిటీ సోదరులు గురువారం గోదావరి తీరంలో ప్రత్యేక నమాజు నిర్వహించారు. సంవృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులకు, ప్రజలకు అల్లా దయ, కృపా కటాక్షాలు ఉండాలని కోరుతూ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని సాలెహా మజీద్‌కు చెందిన ఇమాంసాబ్ అబ్దుల్లా మాట్లాడుతూ.. అనంత కరుణామయుడు అల్లా దయతో ప్రకృతి కటాక్షించి సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక నమాజులు చేసినట్లు తెలిపారు. ఇలా వరుసగా మూడు రోజులు నమాజులు చేస్తామని ఆయన ప్రకటించారు. ప్రతిరోజు చేసే నమాజుకు ఈ ప్రార్థనలు ప్రత్యేకమని వివరించారు. ఇదే క్రమంలో ముస్లిం పెద్దలు సర్దార్ ఖాన్, మక్బూల్ ఖాన్ మాట్లాడుతూ వర్షాలు లేకుంటే వ్యవసాయం ముందుకు సాగక రైతులకు సరైన పంటలు పండక అవస్థలు పడే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. మంథని పట్టణంలోని సాలెహా మజీద్ కమిటీ అధ్యక్షుడు యాకూబ్, ఆఫిజ్, ఎండీ లతీఫ్, మజీద్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అలీం ఖాన్, చాంద్, అక్బర్, శంశీర్, షాహిద్, ఐసన్, నిజాం, అంజద్, అజీమ్, హైమద్, బాబా, మోహిన్, పట్టణ ముస్లిం మైనార్టీ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బస్టాండ్ మరమ్మతుల పనులు చేపట్టాలి

### జీఎంకు మాజీ ఎంపీటీసీ వినతి



**జనం పవర్, రామగిరి, ఆగస్టు 7:** బస్టాండ్ మరమ్మత్తుల పనులు త్వరితగతిన చేపట్టాలని జీఎంకు మాజీ ఎంపీటీసీ వినతిపత్రం అంద జేశారు. గురువారం రామగిరి మండలం పన్నూర్ గ్రామంలోని ఆర్జి–3 జీఎం కార్యాలయంలో పన్నూర్ తాజామాజీ ఎంపీటీసీ చిందం మహేష్, ఆర్జి–3 జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకార్ రావుని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. పన్నూర్ సెంటర్ వద్ద సింగరేణి సంస్థ నిర్మించిన బస్టాండ్ రోడ్డు వెడల్పు పనుల కారణంగా కిందికి దిగిపోవడం వల్ల వర్షాకాలంలో బస్టాండ్ మొత్తం నీటితో నిండిపోతుండడం, దీనివల్ల ప్రయాణికులు రాకపోకల్లో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు బస్టాండ్ మరమ్మత్తుల పనులు త్వరితగతిన చేపట్టాలని జీఎంని కోరారు.

## మధ్యాహ్న భోజన కార్మికులకు న్యాయం చేయాలి




**జనం పవర్, మాడుగులపల్లి, ఆగస్టు 7:** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఆధ్వర్యంలో 'చలో హైదరాబాద్' ధర్నాలో పాల్గొనడానికి వెళ్లిన మాడుగులపల్లి మండల మధ్యాహ్న భోజన కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ అరెస్టులపై మండలంలో తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి. ఈసందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రొండి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు, వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. అరెస్టైన వారిలో రేణుక, సైదమ్మ, యాదమ్మలు ఉన్నారు.

## హాస్టల్ విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

### అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్




**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 7:** వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల సౌకర్యార్థం హాస్టల్ నుండి బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ డిఎంకు అఖిలపక్ష ఐక్యవేదిక నాయకుడు సతీష్‌యాదవ్ గురువారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ మాట్లాడుతూ వనపర్తి జిల్లా కేంద్రంలో పలు ప్రభుత్వ కాలేజీ, పాఠ శాలలకు హాస్టల్‌లు దూరంగా ఉండడం, వారి చదువులకు ఆటంకం కలుగుతుందని వెంటనే సంబంధిత అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలని అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కొత్త గొల్లశంకర్, గౌనికాడి యాదయ్య, బొడ్డుపల్లిసతీష్, శివకుమార్, కృష్ణయ్య, నాగరాజు, రామస్వా మి, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అధినాయకత్వానికి వినతి

### కేసి వేణుగోపాల్‌ను కలిసిన గిరిజన సంఘాల నాయకులు



**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 7:** పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవించే గిరిజన తెగల మధ్య రిజర్వేషన్ చిచ్చులు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని కొంతమంది కలిసి వివిధ రకాల కుట్రలు చేస్తున్నారని శుక్రవారం ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ కేసు వేణుగోపాల్‌ను కలిసి గిరిజన సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు, ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాబూరావుని తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన శక్తి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వెంకటేశ్ చౌహాన్. గిరిజన సంక్షేమ సం ఘం రాష్ట్ర అధ్యక్షులు లక్పతి నాయక్ అలాగే బంజారా విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్య క్షులు శివ నాయక్, మోహన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువుపల్లిలో ఘనంగా బోనాలు

**జనం పవర్, మాడుగులపల్లి, ఆగస్టు 7:** మాడుగులపల్లి మండలంలోని చెరువుపల్లి గ్రామంలో గురువారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు బోనాలతో వచ్చి ఊరు మధ్యలో ఉన్న బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేసి గ్రామ దేవతలు ముత్యాలమ్మలకు ఆడపడుచు లు బోనాలతో సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖ సంతోషాలతో కల్గి ఉండాలని కోరుకున్నారు.

## లోక కళ్యాణార్థం చండీయాగం

### బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి



**జనం పవర్, మంథని, ఆగస్టు 7:** మంథని పట్టణంలోని రాంరెడ్డి కాంప్లెక్స్‌లో గురు వారం బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి ఆయన తల్లి దండ్రులు మాజీ ఎమ్మెల్యే రామ్‌రెడ్డి వసుమతిలతో కలసి మహాచండి హెూమం నిర్వహించారు. అనంతరం సునీల్ రెడ్డి మాట్లాడుతూ...లోక కళ్యాణర్థం, మంథని నియోజకవర్గ ప్రజలందరు పాడి పంటలు, సుఖసంతోషాలతో ఎల్లప్పుడూ ఉండాలని, దేవాలయల పరిరక్షణ కొరకై ఈ చండియాగం పాలేపు చంద్ర శేఖర్ శాస్త్రిచే మూడు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

# కన్నారం దళితులపై కనికరం చూపండి

## సాగు భూమిని ఆక్రమించే యత్నం



**జనం పవర్, వేలేరు, ఆగస్టు 7:** వారంతా అమాయకులు.. ఆపై నిరక్షరాస్యులు. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి కునుకు తీసే వరకు తమ కుటుంబాల పోషణ గురించి తప్ప సమాజ వర్తమాన విషయాలు పట్టించుకోని దీనులు. తమకున్న కొద్దిపాటి భూమిలో తరతరాలుగా వ్యవసాయం చేసుకుంటూ బతుకు బండిని నెట్టుకొస్తున్న నిర్భాగ్యులు. అందులోను తరతరాలుగా అణిచివేతకు గురవుతున్న దళిత సామాజిక వర్గం. అలాంటి వారి భూములు ఇప్పుడు ఆక్రమణదారుల పాలై అన్యాయవు అంచున ఆ దళితులు కొట్టు మీట్టాడుతున్నారు. వివరాల్లోకి వెళ్లితే హనుమకొండ జిల్లా వేలేరు మండలం కన్నారం అనుబంధ గ్రామమైన ఇచ్చులపల్లికి చెందిన దళితులు సర్వే నెంబర్ 53/సి లో ఎకరం 19 గుంటల భూమిని తంతరాలుగా సాగు చేసుకుంటూ అనుభవిస్తున్నారు. అయితే ఇటీవల అదే గ్రామానికి చెందిన ప్రైవేట్ ఇంజనీరు, తన కున్న డబ్బుతో ఏమైనా చేయగలను అనుకుంటున్న మిడిదొడ్డి కొమురయ్య అనే వ్యక్తి రెవెన్యూ రికార్డుల్లో దొర్లిన చిన్నపాటి తప్పును ఆసరాగా చేసుకుని కన్నారం గ్రామానికి చెందిన రాగుల లచ్చవ్వతో చేతులు కలిపి ఆ భూమిని సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న ఇచ్చులపల్లి దళితులు వేలేరు తహసీల్దార్ మొదలు హనుమకొండ ఆర్డీవో వరకు కలిసి విజ్ఞప్తి చేసినా తమకు న్యాయం జరగడం లేదని వాపోతున్నారు. రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో, కన్నారంలో ప్రజల సమక్షంలో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని, లేదంటే తమకు చావే శరణ్యమని బాధితులు మిడిదొడ్డి పోషయ్య, మిడిదొడ్డి రవి, పుష్పలత, సురేష్, వేంకటాద్రి, షాంసన్, రవి, వారి కుటుంబ సభ్యులు జనం పవర్ విలేఖరి ఎదుట కన్నీళ్లు పెట్టుకున్నారు.

## పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



**జనం పవర్, బెజ్జంకి, ఆగస్టు 7:** మండలంలోని చిలాపూర్‌పల్లి గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి రఫీ మద్యం సేవించి విధులకు హాజరవుతున్నట్లు ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతర వేణి మహేష్ ఆరోపించారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి రఫీ నాలుగు నెలల క్రితం చిలాపూర్ గ్రామపంచాయతీకి బదిలీపై వచ్చారన్నారు. అప్పటి నుంచి నిత్యం మద్యం సేవించి విధులకు హాజరవుతున్నట్లు తెలిపారు. నిత్యం మద్యం సేవించి పంచాయతీ ఆఫీస్ పైన ఉన్న మహిళా సంఘ భవనంలో పడుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎంపీడీవో, ఎంపీఓ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## స్థానిక ఎన్నికల కోసమే రైతు భరోసా

**- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**



**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 7:** కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికల కోసమే రైతు భరోసా ఇచ్చిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. గురువారం మెదక్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన రైతు ధర్నాలో నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ రైతులకు, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి వ్యవసాయ రంగాన్ని, ఆహార ఉత్పత్తులను దేశంలోనే అగ్రభాగాన నిలిపారని కొనియాడారు. కొవిడ్ సమయంలో అన్ని రంగాలు మూతపడిన కేసీఆర్ దగ్గరుండి రైతులకు సాగు నీరు, 24 గంటల కరెంట్, యూరియా సరఫరా, రైతు బంధు సకాలంలో ఇచ్చి కొనుగోలు పూర్తి చేసి లక్షలాది రైతులతో పాటు ప్రజలను కాపాడుకున్నారన్నారు.

నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 600 రోజులైనా పాలన గాలికి వదిలి రైతులను బజారున నిలబెట్టారని దుయ్యబట్టారు. రైతు భరోసాను కేవలం ఎన్నికల ఆయుధంగా కాంగ్రెస్ ఉపయోగించుకుంటుందన్నారు. బోనస్ ఇస్తామని పోయిన వానకాలం, యాసంగికి బోనస్ ఎగ్గొటిందన్నారు. అన్ని రకాల వడ్లకు బోనస్ అని చెప్పి ఎన్నికల తర్వాత కేవలం సన్నాలకు మాత్రమే అని రైతులను మోసం చేసిందన్నారు. ఎన్నికలకు ముందు 47వేల కోట్ల రుణమాఫీ చేస్తామని కేవలం 21వేల కోట్ల రుణమాఫీ చేసి చేతులు దులుపుకొన్నదన్నారు. కృష్ణా, గోదావరి నది జలాలు ఆంధ్రా పాలవుతున్న, వృథాగా సముద్రం పాలవుతున్న సీఎం నిర్లక్ష్యం చేస్తు న్నారన్నారు. యూరియా కొరత నివారించలేని ప్రభుత్వం రైతులకు ఏమి మేలు చేస్తుందన్నారు. ఈ రాష్ట్రంలో సింగిల్ విండోల,మార్క ఫెడ్ ద్వారా ఇతర 9 వేల సెల్స్ కౌంటర్లు ఉన్నాయన్నారు. ఎక్కడ కూడా యూరియా లేక చెప్పులు క్యూ లైన్ లో పెట్టే దుస్తితి దాపురించిందన్నారు మంత్రి తుమ్మలకు రైతుల మీద ధ్యాసకూడా లేదని వాపోయారు. అదే కేసీఆర్ హయాంలో సీజన్ ప్రారంభం నాటికి కేంద్రంతో మాట్లాడి యూరియా అందేవిధంగా చర్యలు తీసుకున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత బోనస్ పేరు చెప్పి రైతు భరోసా ఎగ్గొట్టడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. రేవంత్ పాలన ప్రజలకు మంచి చేయడం మాని ప్రతిపక్షాలపై కక్ష్యపూర్తంగా వ్యవహ రిస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చీకటి స్నేహం చేస్తూ రాష్ట ప్రయోజనాలను గాలికి వదిలేస్తున్నారని విమర్శించారు. హామీలు ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు.

## ముర్రుపాలు పిల్లల ఎదుగుదలకు దోహదపడుతాయి



**జనం పవర్, బెజ్జంకి, ఆగస్టు 7:** ముర్రుపాలు పిల్లల ఎదుగుదలకు ఎంతో దోహద పడుతాయని మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో ప్రవీణ్ సూచించారు. గురువారం బెజ్జంకి మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆరునెలల వరకు శిశువుకు తల్లిపాలు పట్టించాలన్నారు. ఆరు నెలలు పూర్తి అయిన తర్వాత అనుబంధ పోషకాహారం తినిపించాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్య లక్ష్మి భోజనం, బాలామృతం ప్రాముఖ్యతను తల్లులకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అంది స్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతం నిర్వహించి, ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాశన కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి, అంగన్‌వాడీ టీచర్లు, పిల్లల తల్లులు హాజరయ్యారు.

# బొంతపల్లి ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం

## రాజగోపుర నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



**జనం పవర్, పటాన్‌చెరు (బొంతపల్లి), ఆగస్టు 7:** రాష్ట్రంలో ప్రముఖ శైవ క్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన బొంతపల్లిలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవస్థానం అభివృద్ధికి తనవంతు సహకారం నిరంతరంగా అందిస్తున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. 8 కోట్ల 60 లక్షల రూపాయల అంచనా వ్యయంతో, 142 అడుగుల ఎత్తు, 9 అంతస్తుల నూతన రాజగోపుర నిర్మాణానికి గురువారం ఉదయం ఎమ్మెల్యే జీఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొంతపల్లి దేవస్థానం ఘనమైన చరిత్ర కలిగిన పవిత్ర స్థలమన్నారు. దశాబ్ద కాలంగా దేవాలయం అభివృద్ధికి తమ సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. మూడు రాజగోపురాల నిర్మాణం ఇప్పటికే పూర్తి అయిందన్నారు. ఇప్పుడు భవిష్యత్ తరాలకు గుర్తుండి పోయే విధంగా, భక్తుల సహకారంతో ఈ భారీ రాజగోపురాన్ని నిర్మించబోతున్నామని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. గోపుర నిర్మాణానికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మాజీ చైర్మన్ భద్రప్ప, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ డైరెక్టర్లు, సీనియర్ నాయకులు, భక్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్సీపురంలో హంపీ షాపింగ్ మాల్ ప్రారంభం

**భారీగా మహిళల రద్దీతో స్వల్ప ఉద్రిక్తత**



**జనం పవర్, పటాన్‌చెరు (ఆర్సీపురం), ఆగస్టు 7:** పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఆర్సీపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన హంపీ వస్త్ర షాపింగ్ మాల్ గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, సినీ నటులు రీతూ వర్మా, నేహా శెట్టి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాగా మాల్ యాజమాన్యం ఓపెనింగ్ ఆఫర్ కింద 39 రూపాయలకే చీరలు అందిస్తున్నట్లు ముందస్తుగా ప్రచారం జరిపింది. శ్రావణ మాసం, వరలక్ష్మీ వ్రతం, రాఖీ పౌర్ణమి లాంటి పండుగలు సమీపించడంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు మాల్‌కు తరలివచ్చారు. ఒక్కసారిగా పెరిగిన రద్దీకి మాల్ సిబ్బంది తట్టుకోలేక తాత్కాలికంగా మాల్‌ను ప్రారంభం రోజునే మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బిల్లింగ్ కౌంటర్ల వద్ద గంటల తరబడి వేచిచూడాల్సి రావడం, విద్యుత్ అంతరాయం వల్ల అమ్మకాలు ఆలస్యం కావడం గమనార్హం.

**మహిళలకు తీవ్ర అసౌకర్యం..**

చిన్నారులతో వచ్చిన మహిళలు బిల్లింగ్ క్యూల్లో గంటల తరబడి నిల్చోవాల్సి వచ్చింది. సరైన సదుపాయాలు లేకపోవడం, పార్కింగ్ సౌకర్యాలు లేక రోడ్లపైనే వాహనాలు నిలిపివేయడం వల్ల భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

సామాన్య ప్రజల అంచనాలకు అనుగుణంగా మాల్ ప్రారంభం జరగకపోవడంతో స్థానికులు నిరాశ చెందారు. భవిష్యత్‌లో ఇలాంటి భారీ ఈవెంట్లకు తగిన ఏర్పాట్లు చేయాలని వారు కోరుతున్నారు. యాజమాన్యం వినియోగదారులకు సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో అవస్థలు పడాల్సి వచ్చిందని స్థానికులు తెలిపారు.

## జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



**జనం పవర్, బెజ్జంకి, ఆగస్టు 7:** జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ మాధురి కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల టాస్క్‌ఫోర్సు సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఈ నెల 11న నులిపురుగుల దినోత్స వాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, ఎంఈఓ మహతీ లక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, హెల్త్ సూపర్వైజర్లు, ప్రైవేట్ కళాశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాము కాటుతో గేదె మృతి



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 7:** సిద్దిపేట జిల్లా నంగు నూరు మండలంలోని అక్కెనపల్లి గ్రామంలో గురువారం పాము కాటుతో గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన సంద యాదగిరి అనే రైతు రోజు మాదిరిగానే తన పాడి గేదెను బుధవారం సాయంత్రం తన వ్యవసాయ పొలం వద్ద గల కొట్టంలో కట్టేశాడు. గురువారం ఉదయం తన కొట్టంలో కట్టేసి ఉన్న పాడి గేదె పాము కాటుతో మృతి చెందింది. సుమారు రూ.90 వేల విలువ గల పాడి గేదె మృతి చెందిందని రైతు తెలిపారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన వేడుకున్నాడు.

## ఆర్థిక సాయం అందజేత

**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 7:** బీఆర్ఎస్ నాయకుడికి ఎమ్మెల్యే హరీష్ రావు ఆర్థిక సాయం అందజేశారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని పాలమాకుల గ్రామంలో సీనియర్ నాయకులు రంగు రమేష్ గౌడ్ తండ్రి లింగయ్య గౌడ్ అనారోగ్యంతో గురువారం ఉదయం మృతి చెందాడు. ఈ కుటుంబానికి దహన సంస్కరణలకు స్థానిక ఎమ్మెల్యే హరీష్ రావు 5 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రతి కార్యకర్తకు తాను వెన్నంటి ఉంటానని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య, మాజీ సర్పంచ్ ఎల్లంకి రవీందర్ రెడ్డి, పంగా కుమారస్వామి, ఓజాలు, సకినాల శివశంకర్, సీనియర్ నాయకులు వేణు యాదవ్, దుంబాల శ్రీనివాస్, గుండెల్ని కొమురయ్య , వేల్పుల ఐలయ్య, రంగు చందు గౌడ్, సుండు పరుశురాములు, బాలమల్లు మౌళి, సంపత్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకటట్ తదితరులు పాల్గొన్నారు.



# పెద్ద సౌత్ స్టార్ నాకు క్షమాపణలు చెప్పాడు.. ఎందుకంటే: తమన్నా



అన్ని భాషల్లో స్టార్ హీరోల సరసన నటిస్తూ సినిమాలు, వెబ్ సిరీస్‌లతో అలరిస్తున్నారు నటి తమన్నా . తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ తొలినాళ్లను గుర్తుచేసుకున్నారు. చిన్న వయసులోనే ఇండస్ట్రీకి వచ్చినట్లు తెలిపారు. ఆ సమయంలో ఎన్నో ఇబ్బందులు పడినట్లు చెప్పారు. అసౌకర్యంగా ఉందని చెప్పినందుకు తన స్థానంలో మరో నటిని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ''నేను చిన్న వయసులో ఇండస్ట్రీకి వచ్చాను కాబట్టి నాకేం తెలియదని అనుకునేవారు. నా విశ్వాసాన్ని దెబ్బతీయాలని చూశారు. ఇలా చాలాసార్లు జరిగింది. అవమానించడానికి ప్రయత్నించారు. పరిశ్రమకు వచ్చిన కొద్దికాలంలోనే ఓ పెద్ద సౌత్ స్టార్ సరసన నటించే అవకాశం వచ్చింది. ఆయనతో కొన్ని సన్నివేశాల్లో నటించేటప్పుడు అసౌకర్యంగా అనిపించింది. దర్శకనిర్మాతలకు నాకు ఇబ్బందిగా ఉందని, చేయలేనని చెప్పా. అప్పుడు ఆ అగ్రహీరో 'హీరోయిన్‌ను మార్చండి' అని నాపై కేకలు వేశాడు. ఎవరైనా మనల్ని అవమానించారని బాధపడుతూ మనం కూడా తిరిగి వాళ్లతో అలా ప్రవర్తించకూడదని మౌనంగా ఉన్నాను. ఆయన మాత్రం ఆరోజు సెట్‌లోనే అందరి ముందు పెద్దగా కేకలు వేశాడు. మరుసటిరోజు తనంతటతానే నా వద్దకువచ్చి క్షమాపణలు చెప్పాడు. తనకు కోపం వచ్చిందని అందుకే అరిచినట్లు తెలిపాడు. నాతో అలా ప్రవర్తించి ఉండకూడదని పశ్చాత్తాపపడ్డాడు'' అని తమన్నా తెలిపారు. అయితే, ఆ బిగ్ సౌత్‌స్టార్ పేరు మాత్రం ఆమె చెప్పలేదు. 2005లో 'చాంద్ సా రోష్ చెహ్రా' అనే సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చారు తమన్నా . ఆ తర్వాత 'శ్రీ' సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించారు. 'హ్యాపీడేస్'తో మంచి గుర్తింపు రావడంతో వరుస అవకాశాలు వచ్చాయి. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో అగ్రహీరోల సరసన నటించారు. తాజాగా 'రైడ్ 2'తో ఓ ప్రత్యేక పాటలో అలరించిన ఆమె ప్రస్తుతం నాలుగు హిందీ సినిమాల్లో నటిస్తున్నారు. ఇవన్నీ సెట్స్‌పై ఉన్నాయి. తెలుగులో ఇటీవల 'ఓదెల 2'తో శివశక్తిగా మెప్పించారు. మరోవైపు తమన్నా తాజాగా చెప్పిన బ్యూటీ సీక్రెట్ నెట్టింట చర్చకు దారితీసింది. మొటిమలు తగ్గాలంటే సలైవా రాసుకోవాలని ఆమె సూచించారు. అందులో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయని తెలిపారు. అవి మొటిమలతో పోరాడతాయని అయితే ఇది తన వ్యక్తిగత పర్సనల్ చిట్కా అని వెల్లడించారు. ఈ చిట్కాను పాటించొద్దంటూ పలువురు చర్మ వైద్యనిపుణులు సోషల్ మీడియాలో వీడియోలు చేయడంతో ఈ బ్యూటీ చిట్కా టాపిక్‌గా మారింది.



# మరో కథ విన్నారా?

కథానాయకుడు రవితేజ త్వరలో 'మాస్ జాతర'తో థియేటర్లలో సందడి చేయనున్నారు. మరోవైపు కిశోర్ తిరుమల దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. దీంతో పాటు 'మ్యాడ్' ఫేమ్ కల్యాణ్ శంకర్ చెప్పిన కథకు పచ్చజెండా ఊపినట్లు వార్తలొచ్చాయి. కాగా, ఇప్పుడాయన మరో ప్రాజెక్ట్ విషయమై కన్నడ దర్శకుడు ఎ.పి.అర్జున్‌తో చర్చలు చేస్తున్నట్లు సమాచారం. ఈ కథాలోచన నచ్చడంతో దీనిపై రవితేజ సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఓ ప్రముఖ కన్నడ నిర్మాణ సంస్థ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించే అవకాశముంది. దర్శకుడు అర్జున్ కన్నడలో 'అద్దూరి' చిత్రంతో విజయాన్ని అందుకున్నారు. గతేడాది 'మార్టిన్' అనే సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించారు.

## స్పోర్ట్స్



# భారత క్రికెట్ ఎవరి కోసం ఆగదు

భారత క్రికెట్‌లో ఎంతో ప్రతిభ ఉందని.. అది ఎవరి కోసం ఆగదని మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ అన్నాడు. విరాట్ కోహ్లి వెళ్లగానే యశస్వి జైశ్వాల్, రిషబ్ పంత్, శుభ్‌మన్ గిల్ జట్టు కోసం నిలబడ్డారని తెలిపాడు. ''భారత క్రికెట్ ఎవరి కోసం ఆగదు. ఇక్కడ చాలా ప్రతిభ ఉంది. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో భారత ప్రదర్శనే ఇందుకు నిదర్శనం. మనోళ్లు అద్భుతంగా ఆడారు. భారత క్రికెట్ అంటే అదే. సునీల్ గావస్కర్ రిటైరయ్యాక సచిన్ తెందుల్కర్ వచ్చాడు. రాహుల్ ద్రవిడ్, వీరేందర్ సెహ్వాగ్, వీవీఎస్ లక్ష్మణ్ కూడా జతకలిశారు. వారు వెళ్లగానే కోహ్లి వెలుగులోకి వచ్చాడు. కోహ్లి నిష్క్రమించగానే యశస్వి, రిషబ్, గిల్ నిలబడ్డారు. భారత క్రికెట్లో ప్రతిభకు కొదవలేదు. అది పెరుగుతూనే ఉంటుంది. అద్భుతమైన వ్యవస్థతో దేశవాళీ క్రికెట్ బలంగా ఉంది. ఐపీఎల్ అలాంటి వేదికే. ఎ- జట్టు, అండర్-19 జట్లు కూడా ఉన్నాయి. ఇంగ్లాండ్‌లో భారత్ గొప్పగా ఆడింది. గిల్, గౌతమ్ గంభీర్‌కు అభినందనలు. 2002 లేదా 2007 తర్వాత ఇంగ్లాండ్‌లో భారత టాప్-6 బ్యాటర్లు నిలకడగా రాణించడం ఇదే తొలిసారి'' అని గంగూలీ పేర్కొన్నాడు.

# 750+ పరుగులు చేసినా 'టాప్ -10' నుంచి గిల్ ఔట్.. కారణమిదేనా?




ఇంగ్లాండ్ - భారత్ ఐదో టెస్టు ముగిసిన రెండు రోజులకే ఐసీసీ ర్యాంకులు వెలువడ్డాయి. బౌలింగ్, బ్యాటింగ్‌లో ఇంగ్లాండ్ కంటే టీమ్ఇండియా ఆటగాళ్లే ఎక్కువ ఆధిపత్యం ప్రదర్శించారు. దీంతో ఐసీసీ ర్యాంకుల్లో ఆ ప్రభావం కనిపించినా.. ఒకేఒక్క ఆటగాడి విషయంలో ఇది తిరగబడటం గమనార్హం. అతడేమన్నా సరిగ్గా ఆడకుండా ఉన్నాడా? అంటే అదేం కాదు. ఈ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ అతడు. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ నెగ్గిన ప్లేయర్. ఇప్పటికే అర్థమై ఉంటుందిగా అతడే కెప్టెన్ శుభ్‌మన్ గిల్. ఐసీసీ ర్యాంకుల్లో నాలుగు స్థానాలు దిగువకు పడిపోయాడు. సాధారణంగా బాగా ఆడితే ఆటోమేటిక్‌గా ర్యాంక్ పెరగాలి కానీ.. ఇలా జరిగిందేంటా? అని అభిమానుల్లో సందేహం మొదలైంది. అయితే, దీనికి కారణం ఉందని తాజా కథనాలను బట్టి తెలుస్తోంది. ఒకే సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో కెప్టెన్‌గా శుభమన్ గిల్ నిలిచాడు. ఇంగ్లాండ్‌పై ఐదు టెస్టుల్లో 754 పరుగులు చేశాడు. క్రికెట్ దిగ్గజం డాన్ బ్రాడ్‌మన్ (801) తర్వాత గిల్‌దే రికార్డు. అయితే, ఐదో టెస్టుకు ముందు గిల్ ఐసీసీ ర్యాంకుల్లో 9వ స్థానంలో ఉన్నాడు. కానీ, చివరి మ్యాచులో అతడు కేవలం 32 పరుగులు మాత్రమే చేశాడు. ఇదే గిల్ ర్యాంక్‌పై గట్టి దెబ్బ కొట్టింది. ఇందులో కనీసం హాఫ్ సెంచరీ చేసి ఉన్నా అతడి రేటింగ్‌లో బాగా తేడా వచ్చేదే. మరోవైపు చివరి టెస్టులో సెంచరీ చేసిన యశస్వి జైస్వాల్ మూడు స్థానాలను మెరుగుపర్చుకోవడం గమనార్హం. గాయం కారణంగా దూరమైన రిషభ్ పంత్ ఒక స్థానం కిందికి పడిపోయాడు.

## అట్కిన్సన్, టంగ్ విషయంలో ఇలా..

ఇంగ్లాండ్ - భారత్ మధ్య చివరి టెస్టులో ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన ప్రతి బౌలరూ ఐసీసీ ర్యాంకుల్లో దూసుకురావడం విశేషం. ఇంగ్లాండ్ ఆటగాడు గస్ అట్కిన్సన్ కేవలం చివరి మ్యాచ్‌లోనే ఆడాడు. అయితే, ఐదు వికెట్ల ప్రదర్శన చేయడంతోపాటు మొత్తం 8 వికెట్స్ తీశాడు. దీంతో రెండు స్థానాలు మెరుగై కెరీర్‌లో తొలిసారి టాప్-10లోకి దూసుకొచ్చాడు. సిరీస్ ఆసాంతం అద్భుతంగా రాణించిన సిరాజ్ ఏకంగా 12 స్థానాలు దూసుకొచ్చి 15వ ర్యాంకులో నిలిచాడు. సిరాజ్ కూడా ఫైఫర్ తీశాడు. జోష్ టంగ్ కూడా చివరి మ్యాచ్‌లో 8 వికెట్లు తీశాడు. ఇందులో '5' వికెట్ల ప్రదర్శనా ఉంది. దీంతో 14 స్థానాలు మెరుగుపర్చుకొని 46వ ర్యాంకులోకి వచ్చాడు. అతడు మూడు మ్యాచుల్లో 19 వికెట్లు తీసి ఇంగ్లాండ్ తరపున టాప్ వికెట్‌టేకర్‌గా నిలిచాడు.


PRINTED PUBLISHED,OWNED BY G.THIRUPATHI,PRINTED AT SRK PRINTERS (V)KOKKERAKUNTA (M)RAMADUGU (D)KARIMNAGAR 505001.TELANGANA,
PUBLISHED FROM H.NO 10-6-219, KISAN NAGAR,KARIMNAGAR 505001,TELANGANA.RNI NO TEL TEL/2016/69862, EDITOR:BANDARI MARUTHI.

# సమస్యలకు నిలయం ప్రయాణ ప్రాంగణం

## కనీస వసతులు లేక ప్రయాణికుల ఇబ్బందులు



**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 7 :** వనపర్తి ఆర్టీసీ డిపో అంటేనే ఘనమైన చరిత్ర గలిగిన డిపోలలో ఒకటిగా ప్రత్యేక గుర్తింపు ఉంది. అలాంటి బస్టాండ్ నేడు సమస్యలతో ప్రయాణికులకు ఇబ్బందికలిగిస్తుంది. వనపర్తి కొత్త బస్టాండ్‌లో చెట్టు కింద బస్సుల కోసం ప్రయాణికులు వేచి ఉండాలి. నిజాం కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటైన ఐదారు డిపోలలో వనపర్తి డిపో ఒకటి, కాగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో వనపర్తి డిపో మొదటిది. అలాంటి వనపర్తి డిపో రాజా రామేశ్వరరావు పరిపాలన కాలంలో పట్టణంలోని పాత బస్టాండ్‌తో కేవలం రెండు బస్సులతో 1932 సంవత్సరంలో డిపోగా ఏర్పాటై నేటి వరకు ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు చేరుస్తు సేవలు అందిస్తుంది. రోజు రోజుకు పట్టణం విస్తరించడంతో పాటు, జిల్లా జనాభా సంఖ్య పెరుగుతున్న తరుణంలో 1988-89 మధ్య కాలంలో ఆరు ప్లాట్‌ఫామ్‌లతో కూడిన కొత్త బస్టాండ్‌ను నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కొత్త బస్టాండ్ నుంచి ఆర్టీసీ సంస్థ సేవలు అందిస్తోంది. ఒక పక్క వనపర్తి జిల్లాగా ఏర్పడిన మరోపక్క జనాభా పెరగడంతో ఆనాడు నిర్మించిన ఆరు ప్లాట్‌ఫామ్‌ల బస్టాండ్ ప్రాంగణం ప్రయాణికులకు సరిపడటం లేదు. వనపర్తి నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సుల కోసం ప్రయాణికులు చెట్ల కిందే పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఎండా కాలం వచ్చినా, వర్షాకాలం వచ్చినా, చలికాలం వచ్చిన చెట్ల కిందే ఉండాల్సిన పరిస్థితులు మాత్రం మారడం లేదని పలువులు ప్రయాణికులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

**రోజుకు దాదాపు 50,000 వేల మంది ప్రయాణం..**

వనపర్తి డిపో సంస్థ ద్వారా ప్రతి రోజు దాదాపు 50000-60000 వేల మంది వారి వారి గమ్య స్థానాలకు ప్రయాణం చేస్తున్నారు. జిల్లాలో ఉన్న ఏకైక వనపర్తి డిపో నుంచి వివిధ మార్గాల గుండా బస్సులు ప్రయాణికులను చేరవేస్తున్నారు. కేవలం ఆరు ఫ్లాట్ ఫామ్‌ల ప్రాంగణంతో ప్రయాణికులను చేరవేస్తున్న తరుణంలో ప్రయాణికులకు సరిపడా ఫ్లాట్ ఫామ్‌లు లేకపోవడం ప్రయాణికులకు కొంత ఇబ్బంది పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. మరి ముఖ్యంగా హైదరాబాద్ వెళ్లేందుకు బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు చెట్ల కింద నిరీక్షణ తప్పడం లేదు. కూర్చోడానికి సరైన కుర్చీలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు తొలగాలంటే మరికొన్ని ఫ్లాట్ ఫామ్‌లు నిర్మించాల్సిన అవసరం ఉంది. దీంతో వనపర్తి డిపో గత మేనేజర్ వనపర్తి డిపోకు అదనపు ఫ్లాట్ ఫామ్‌లు నిర్మించాల్సిన అవసరం ఉందని మహబూబ్‌నగర్ టీఎస్ ఆర్టీసీ డిప్యూటీ ఇంజనీర్ (సివిల్)కు నోట్‌ఫైల్ పెట్టారు. గతంలో కూడా ఇక్కడ మేనేజర్‌గా విధులు నిర్వహించిన కొందరు మేనేజర్లు అదనపు ఫ్లాట్ ఫ్లామ్‌లు నిర్మించేందుకు ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. వనపర్తి డిపోలో ప్రస్తుతం దాదాపుగా 200 బస్సులు రోజు ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి. ప్రస్తుతం పట్టణ జనాభా పెరిగింది. జాతీయ రహదారుల విస్తరణతో బస్సుల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. దీనికి అనుగుణంగా బస్టాండ్ విస్తరించాలి.

**ప్రైవేట్ వాహనాలతో ఇబ్బందులు..**

ప్రైవేటు వాహనాలు బస్టాండ్ ప్రాంగణంలో ఇష్టారీతిన నిలుపుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రాంగణంలో ఇష్టాను సారంగా ఆటోలు, ద్విచక్రవాహనాలు నిలపడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

**మరుగుదొడ్ల దుర్వాసన..**

మహిళల, పురుషుల మరుగుదొడ్ల శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తున్నాయి. ఉచితంగా మరుగుదొడ్ల నిర్వహణ ఉన్నప్పటికీ పారిశుధ్య చర్యలు చేపట్టడంలో నిర్వాహకులు విఫలమవుతున్నారు.

**చేతివాటం ప్రదర్శిస్తున్న స్వీపర్లు..**

ప్రభుత్వం బస్టాండ్లో మరుగుదొడ్లు వాడే వారికి ఉచితంగా ఏర్పాటు చేసింది. అక్కడ పని చేసే స్వీపర్లు మరుగుదొడ్ల దగ్గర కూర్చొని వచ్చిపోయే ప్రయాణికుల దగ్గర 10 నుంచి 20 రూపాయలు దాకా వసూలు చేస్తున్నారు. ఇవ్వని వారిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు అని ప్రయాణికులు వాపోతున్నారు. మరుగుదొడ్లను శుభ్రం చేయకపోగా ప్రయాణికులను ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారు అని ప్రయాణికులు తెలిపారు. పురుషుల మరుగుదొడ్లలో రెండు పని చేయకపోగా ఉన్న మూడుతో ప్రయాణికులకు సరిపోవడం లేదు. డోర్లు సరిగ్గా లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్టాండ్లో తాగునీరు వద్ద పరిశుభ్రత పాటించాలి. మరుగుదొడ్లు శుభ్రం చేసే పరికరాలు తాగునీటి వద్ద ఉంచడం. రోజువారీగా శుభ్రం చేసే చర్యలు తీసుకోవాలి. బస్టాండులో బస్సుల కోసం వేది ఉండే వారికి ఏర్పాటు చేసిన బల్లాలు టేబుల్స్ సరిపోవడం లేదు. గంటల పాటు నిలబడి ఉండటంతో ఇబ్బందిగా ఉంటుంది. కాబట్టి బల్లాలు ఏర్పాటు చేయాలి. ప్రయాణ ప్రాంగణంలో మౌలిక వసతులు కల్పించాలి. బస్టాండ్ ఆవరణలో ప్రైవేటు వాహనాల సమస్యను ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్లాలి. పోలీసులు సహాయంతో వాహనాలు నియంత్రణకు కృషి చేయాలి. ప్రయాణ ప్రాంగణంలో నెలకొన్న సమస్యలను వీలయినంత త్వరలో పరిష్కరించాలి. సమస్యలపై డిపో మేనేజర్ చర్యలు తీసుకోవాలి.







# పిల్లల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి



**పెద్దపల్లి, ఆగస్టు 7:** బాల సదనం పిల్లల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయశ్రీహర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. పెద్దపల్లి మండలం చందంపల్లి బస్తి దావాఖానా,బాల సదనం, రంగంపల్లిలోని సఖి సెంటర్, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ..బాల సదనంలోని పిల్లల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతి పిల్లవాడు పాఠశాలలకు వెళ్లేలా చూడాలని,పిల్లల విద్యా ప్రమాణాల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని,చదువులో ముందు ఉండేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సఖి కేంద్రంను ఆశ్రయించిన గృహహింస, ఫోక్సో కేసు,వివిధ సమస్యల్లో ఉన్న బాధితులను రెగ్యులర్‌గా ఫాలో అప్ చేయాలని అన్నారు. పోలీసు అధికారులతో సహకరిం చుకుంటూ ప్రతి కేసు సత్వరంగా పరిష్కారం అయ్యేలా చూడాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, పీహెచ్‌సి డాక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

# 'బీసీ రిజర్వేషన్లపై మోసం చేస్తున్న కాంగ్రెస్'

**పెద్దపల్లి, ఆగస్టు 7:** 42 శాతం రిజర్వేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తున్నదని బీజేపీ నాయకులు ఆరోపించారు. గురువారం పార్టీ పట్టణ, మండల శాఖల అధ్యక్షులు పెంజర్ల రాకేష్, వేల్పుల రమేష్ ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలకు 42% శాతం రిజర్వేషన్ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ తీరును చూసి నట్లయితే ఆడిక్లరేషన్ బీసీల ప్రయోజనాలను పక్కన పెట్టి ముస్లింల ప్రయోజనాలు కాపాడేవిధంగా ఉందన్నారు.బీసీలకు మొత్తంగా 42% రిజర్వేషన్లు అమలు చేయాలి "బీసీలకు 5% రిజర్వేషన్లు పెంచి,ముస్లింలకు అద నంగా మరో 10% రిజర్వేషన్లు కల్పించేం దుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోంది. పరిస్థితిలో కాంగ్రెస్ వ్యవహారం వల్ల పెద్దపల్లి మున్సిపల్‌లో చూస్తే మైనార్టీకోట అదనంగా పోంగా మిగిలిన మున్సిపల్ వార్డులలో పది పర్సెంట్ బీసీ కోటా కింద పోటీ చేయడం జరుగుతుంది దీని ద్వారా పెద్దపల్లి మున్సిపల్‌లో బీసీలకు అన్యాయం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలారపు పర్వతాలు, జిల్లా కౌన్సిల్ మెంబర్ కావేటి రాజగోపాల్,జిల్లా నాయకులు పోల్సని సంపత్ రావు,ఈర్ల శంకర్,ఉప్పు కిరణ్,గుడ్ల సతీష్,గాదాసీ సతీష్,పోగుల రాజు, కూసనపల్లి మధుకర్ పూదరి హరీష్,షిండే,శివ,సాయి వేణు, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూభారతిలో పట్టా అందుకున్న లబ్ధిదారుడు



**జనం పవర్, చొప్పదండి, ఆగస్టు 7:** గంగాధర మండలలోని ఉప్పర మల్యాల గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సులో లబ్ధిదారుడు పండుగ వెంకటేష్ భూ పట్టా కోసం ఫిర్యాదు చేశాడు. సదస్సులో భాగంగా వెంకటేష్ తల్లి పేరిట ఉన్న భూమి ఎలాంటి ఖర్చు లేకుండా ప్రొసీడింగ్ పట్టా జారీ చేశారు. గత నాలుగు సంవత్సరాల కిందట నుంచి నాయొక్క తల్లి మరణించిన నుండి రిజిస్టర్ చేసుకోవడానికి నానా ఇబ్బంది పడ్డను కానీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన భూభారతితో నా పేరిట భూమి రిజిస్టర్ పట్టా అందుకున్నాను. ఈసందర్భంగా ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డికి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, గంగాధర తహసీల్దార్ జోగినిపల్లి అనుపమరావుకు లబ్ధిదారుడు వెంకటేష్ ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు

# 108 అంబులెన్స్‌ను తనిఖీ చేసిన అధికారి

**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 7:** గట్టు ప్రైమరీ హెల్త్ సెంటర్ దగ్గర ఉన్న 108 అంబులెన్స్‌ను తనిఖీ చేసిన 108 జిల్లా అధికారి డి రత్న మయ్య. వీధిలో భాగంగా గురువారం గట్టు 108 అంబులెన్స్ లోని రికార్డులు పరిశీలించడం జరిగింది. అలాగే ఆక్సిజన్,మెడికల్ ఎక్విప్మెంట్ మెడిసిన్స్ చెక్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గట్టు మండల ప్రజలందరూ అత్యవసర పరిస్థితుల్లో 108 కాల్‌చేసి వినియోగించుకోవాల్సిందిగా కోరడమైనది. 108 అంబులెన్స్ 24 గంటలు అందుబాటులో ఉంటుంది. 108కి కాల్ చేసిన ప్రతి ఒక్కరికి దగ్గరకు మా సిబ్బంది తక్షణమే బయలుదేరి 10 నుంచి 15 నిమిషాలలో సేవలందించడానికి సిద్ధంగా ఉంది అన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు



**చందుర్తి, ఆగస్టు 7:** చందుర్తి మండలం కిష్టంపేట అంగన్ వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్ పుష్పలత తల్లిపాల ప్రాముఖ్యత గురించి, తల్లి పాలు తాగడం వల్ల పిల్లలకు కలిగే లాభాల గురించి, బాలింతలకు కలిగే లాభాల గురించి అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాగించడం వల్ల పిల్లలకు జీవితాంతం వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, ముర్రుపాలు మొదటి టీకాగా పనిచేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎమ్ వజ్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజిత, ఆయా, ఆశ కార్యకర్త జ్యోతి, గర్భవతులు ,బాలింతలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలి

**జనం పవర్, వనపర్తి, ఆగస్టు 7:** వనపర్తి పట్టణంలో 24వ వార్డు పీర్లగుట్ట, బండార్ నగర్ కాలనీ బిజెపి పట్టణ అధ్యక్షులు రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో బిజెపి ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో చేసినటువంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లతో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు డి నారాయణ మాట్లాడుతూ 60 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి అక్రమాలకు నిరక్షరాసులను గురి చేసిందని తెలియజేశారు. 24వ వార్డు బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి తిరుమలేష్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ 11 ఏళ్ల పానాలలో 24వ వార్డులో అభివృద్ధికి 14 ఫైనాన్స్ కింద సీసీ రోడ్లు డ్రైనేజ్ కొరకు 11 లక్షల రూపాయలు కేంద్రం నిధులు ఇవ్వడం జరిగింది. 15 ఫైనాన్స్ కింద సిసి రోడ్లు డ్రైనేజీ కొరకు 16 లక్షల రూపాయలు కేంద్రం నిధులు ఇవ్వడం జరిగింది. 15 ఫైనాన్స్ కింద రిటైర్ టీచర్ల ఉద్యోగుల సంఘం కార్యాలయానికి ఆరు లక్షల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం జరిగింది.



14,15 ఫైనాన్స్ కమిషన్ కింద ప్రజాకవి కాళోజి పార్కు అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం జరిగింది. 24వ వార్డులో కరోనా సమయంలో చిరు వ్యాపారుల కోసం పదివేల రూపాయలు లోన్లు కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం జరిగింది. గత పాలకుల వల్ల రాష్ట్రం నుంచి ఎటువంటి నిధులు తీసుకురాకుండా అభివృద్ధి కుంటూ పడడం జరిగింది అధికారం లేకున్నా వార్డులో కేంద్ర ప్రభుత్వం నుంచే అభివృద్ధి జరిగింది రాబోయే మున్సిపల్ ఎలక్షన్లో బిజెపిని ఆదరిస్తే 24వ వార్డు అభివృద్ధికి ఇంకా శక్తివంతంగా తయారవుతుంది అన్నారు. ఈ కార్యక్రమం లో బిజెపి ఓబీసీ అధికార ప్రతినిధి శ్రీశైలం, పార్లమెంట్ ఫుల్ కేతూరి బుడ్డన్న, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్ మాజీ కౌన్సిలర్ సుమిత్రమ్మ, పట్టణ ప్రధాన కార్య దర్శి సుగురు రాములు,దంతోజి నవీన్ కుమార్, ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు కాటమోని కృష్ణ గౌడ్,రాయన్న సాగర్, విజయ్ కుమార్, మోహన్ సాగర్ ఓబిసి పట్టణ అధ్యక్షులు రవి,పట్టణ ఉపాధ్యక్షులు ఉంద కోటి అంజి, ఉపేందర్ , చందు,శివ, చేన్న రాయుడు 24వ వార్డ్ భూత అధ్యక్షు లు నీలేష్ సింగ్, నంద,కార్తీక్, పులిపాటి అంజి, గుంటి శివకుమార్ సాగర్ తది తరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

## మాజీ మేయర్ సునీల్ రావు

**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 7:** స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 15న భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేసేలా చూడాలని,పార్టీ సూచన మేరకు ఈనెల 10 నుండి ఆరు రోజులపాటు చేపట్టాల్సిన తిరంగాయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మేయర్ సునీల్‌రావు పిలుపునిచ్చారు.

బిజెపి ఈస్ట్ జోన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన తిరంగా అభయాన్ సన్నాక సమావేశానికి ఆయనముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలతో కలిసి తిరంగా యాత్ర నిర్వహించాలని, దేశభక్తి పూరిత కార్యక్రమాలు చేపట్టి, దేశ సమైక్యత సమగ్రతల కోసం కట్టుబడి ఉంటామని వారిచే ప్రతిజ్ఞ చేయాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ దేశానికి గర్వకారణంగా మారిందన్నారు. యావత్ ప్రపంచమే భారత్ ధైర్య సాహసాలు,శక్తి సామర్థ్యాలను చూసి నివ్వెరపోయిందన్నారు. మన త్రివిధ దళాల ధైర్య సాహసాలను ప్రశంసిస్తూ ప్లకార్డులు ప్రదర్శించాలని సూచించారు. మాజీ సైనికులు, అమరవీరులు, మాతృభూమి సేవలో ప్రాణాలర్పించిన పోలీసుల ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను సన్మానించాలని కోరారు.



బిజెపి జిల్లా అధికార ప్రతి నిధి బొంతల కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ దేశభక్తిని చాటి చెప్పుకోవడానికి హర్ ఘర్ తిరంగా ప్రోగ్రాం ఎంతో దోహదపడుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయడానికి పార్టీ శ్రేణు లు తగిన కృషి చేయాలన్నారు. సమా వేశంలో ఈస్ట్ జోన్ అధ్యక్షులు అవదుర్తి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మాసం గణేష్ , మాజీ కార్పొరేటర్ లెక్కల వేణు, పాశం తిరుపతి, రాజు, బెల్లం నరేందర్, సాగర్, అనిల్ తది తరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ తరగతులను వినియోగించుకోవాలి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**సిరిసిల్ల:** ఉచిత ఆన్‌లైన్ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. సిరిసిల్ల పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల, తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని సోషల్ వెల్ఫేర్, సారంపల్లిలోని ట్రైబల్ వెల్ఫేర్, నేరెళ్లలోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్, ముస్తాబాద్ మండలంలోని సోషల్ వెల్ఫేర్ స్కూల్, కళాశాలల్లో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన అన్ అకాడమీ ఆన్ లైన్ క్లాస్‌లను గురువారం కేకే మహేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు రూ. లక్షల విలువైన కార్పొరేట్ స్థాయి శిక్షణ ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. విద్య ద్వారానే మార్పుసాధ్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రభుత్వం రూ. లక్షలు విలువ చేసే ఆన్ లైన్ శిక్షణ తరగతులు ఉచితంగా ఇస్తుందని వెల్లడించారు. విద్యార్థి పాఠాలు చక్కగా విని నోట్స్ రాసుకోవాలని సూచించారు. రోజు వాటిని మరోసారి చదువుకోవాలని పేర్కొన్నారు. పాఠాల్లో ఏమైనా సందేహాలు వస్తే నివృత్తి చేసుకోవాలని సూచించారు. శిక్షణలో భాగంగా వచ్చే టెస్ట్ సిరీస్‌ను ప్రాక్టీస్ చేయాలని కలెక్టర్ తెలిపారు. దీంతో ఐఐటీ, జేఈఈ, నీట్ తదితర జాతీయ స్థాయి పరీక్షల్లో రాణించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

దేశంలోని నిపుణులైన టీచర్లచే పిల్లలకు బోధన జరుగుతుందని, ఢిల్లీ లో విద్యార్థులకు అందే శిక్షణ నేడు సాంకేతికతను వినియోగించుకుని మన జిల్లాలోని విద్యార్థులకు కూడా అందిస్తున్నామని తెలిపారు.

ప్రతి రోజు కనీసం 2 గంటల పాటు ఆన్ లైన్ కోచ్చింగ్ తీసుకోవాలని తెలి పారు. విద్యార్థి జీవితంలో 10,11,12వ తరగతులు 3 సంవ త్సరాలు చాలా కీలక సమయమని, ముఖ్యమైన పాఠ్యాంశాలలో బేసిక్స్ ఇంటర్‌లో ప్రారంభం అవు తాయని వివరించారు. విద్యార్థులకు ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసు కుని వస్తే సత్వరమే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ నాయకుడు కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు పెద్ద పీట వేస్తూ పేదల విద్యకై నిరంతరం కృషి చేస్తూ పెద్ద ఎత్తున పేదలకు నిధులు ఖర్చు చేస్తుందని అన్నారు. జిల్లాలో పిల్లలకు ఆన్ లైన్ తరగతుల ద్వారా ప్రవేశ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్‌లో ఫ్రెషర్స్ డే హంగామా



**జనం పవర్, సిద్దిపేట, ఆగస్టు 7:** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని అక్కేనపల్లి తెలంగాణ మోడల్ స్కూల్‌లో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఫ్రెషర్స్ పార్టీతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మంద జానయ్య మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తు లక్ష్యాన్ని నిర్ణయించుకునే వేదికగా ఇంటర్మీడియట్ అన్నారు. ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం నిరంతరం శ్రమించాలని కోరారు. ఇందుకు మన కళాశాలలో అనుభవం, అంకితభావంతో కూడిన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని చెప్పారు. వారి సేవలను వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి విద్యతో పాటుగా క్రమశిక్షణ కూడా అవసరమన్నారు. వినయం లేని విద్య పరిమళం లేని పువ్వు లాంటిదని పేర్కొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో టీచర్లు డాక్టర్ శ్రీనివాస్, శ్రీనివాస్, రజిని, పవన్ కుమార్, నర్సయ్య, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన



**ఏర్గట్ల:** మండలంలోని దోంచంద గ్రామంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వైష్ణవ్ మాట్లాడుతూ ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు లాభాలు, రైతులకి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వివరాల గురించి తెలియజేశారు. పసుపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధిక ఎరువులు వాడడం వల్ల జరిగే నష్టాలు, పాటించవలసిన మెళుకువలు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వైష్ణవ్, ఉద్యాన అధికారి రుద్రవినాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లింగారెడ్డి, సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయ విస్తరుణాధికారి సాయి సచిన్, ప్రియునిక్ కంపెనీ ప్రతినిధి ప్రేమ్ సింగ్, గ్రామా రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**చందుర్తి:** చందుర్తి మండలంలోని మల్యాల గ్రామం హరిజన వాడ, పెరుక వాడ పాఠశాలలోని అంగన్ వాడీ కేంద్రాల్లో రక్షాబంధన్ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. బాలబాలికలు అన్న చెల్లెళ్ల ప్రేమను చాటే ఈ పండుగను ఎంతో ఆనందంతో జరుపుకున్నారు. విద్యార్థినులు పాఠశాలలోని బాలురకు రాఖీలు కట్టి, వారి రక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత రక్షాబంధన్ ప్రాముఖ్యతపై మాట్లాడారు. "రాఖీ కేవలం ఓ దారమే కాదు, అది ప్రేమ, రక్షణ, ఆత్మీయతకు చిహ్నం" అని వారు పేర్కొన్నారు.

ఇలాంటి సంస్కృతిక కార్యక్ర్మాలు విద్యార్థుల్లో పరస్పర గౌరవం, మానవీయత పెంపొందించేందుకు ఎంతో దోహదం చేస్తాయి అన్నారు. విద్యార్థులు ఎప్పుడు సోదర భావంతో ఉండాలన్నారు. లక్ష్యంతో చదువుకొని ముందుకెళ్లాని సూచించారు. జీవితంలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుజాత, అనిత, పెరుకవాడ ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, ఉపాధ్యాయులు, సునీత సరిత, సునీత విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# నేత కార్మికులకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలి

## పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్



**సిరిసిల్ల:** నేత కార్మికులందరికీ రూ 6 వేల పెన్షన్ అమలుచేయాలని పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ డిమాండ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సీఐటీయూ తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిరిసిల్ల పాత బస్టాండులోని నేతన్న విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి వర్కర్ టూ ఓనర్ , త్రిఫ్ట్, ఇతర డిమాండ్లను పరిష్కరించాలని ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ మాట్లాడుతూ.... ప్రభుత్వం, అధికారులు చేనేత దినోత్సవం రోజున సంబరాలు జరుపుకోవడానికి పరిమితం కాకుండా చేనేత , పవర్ లూమ్ కార్మికుల సంక్షేమానికి వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేసి సమస్యల పరి ష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వర్కర్ టూ ఓనర్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే పూర్తి చేసి కార్మికులకు అందించాలని, నేతన్న పొదుపు పథకానికి సంబంధించిన డబ్బులను వెంటనే కార్మికుల ఖాతాలలో జమ చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కోడం రవణ, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సిరిమల్ల సత్యం, ఉడుత రవి, సూరం పద్మ, దాసరి రూప, జిందం కమలాకర్, బెజుగం సురేష్, బాస శ్రీధర్, స్వర్గం శేఖర్, బింగి సంపత్, కారంపురి మహేష్,చింత కింది సుధన్, దోమల రాము, సందుపట్ల పోచమల్లు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలకు గ్యాస్ సిలిండర్, స్టవ్ అందజేత

**చర్ల:** చర్ల మండల పరిధిలోని లింగాపురం గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం ఆ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండే సిబ్బందికి గ్యాస్ సిలిండర్, గ్యాస్ స్టవ్ ను కొత్త సరళ దేవి దంపతులు వితరణ గా అందజేశారు. లింగాపురం గ్రామానికి చెందిన పరుచూరి వెంకయ్య కుమార్తె కొత్త సరళ దేవి కృష్ణ దంపతులు వారు తమ బాల్యంలో చదువుకున్న పాఠశాలకు గురుతుగా ఉండాలని, తమ వంతు బాధ్యతగా ఈ వితరణ చేస్తున్నామని తెలిపారు. వీరి సోదరుడు పరుచూరి మనోహర్ ప్రసాద్ కూడా గతంలో ఇదే పాఠశాలకు సుమారు 40,000/- విలువ గల డస్కు బెంచీలు, పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు వగైరా సామాగ్రిని పంపిణీ చేయడం జరిగిందని వీరికి మీకోసం మేమున్నాం టీం తరపున, స్కూలు సిబ్బంది తరపున, స్కూల్ మధ్యాహ్న భోజనం వండే సిబ్బంది తరుపున హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేశారు.

# ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

**సిరిసిల్ల:** జాతీయ చేనేత దినోత్సవాన్ని గురువారం సిరిసిల్ల పట్టణంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న నేతన్న విగ్రహానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, కేకే మహేందర్ రెడ్డి, ప్రముఖులు పూల మాలలు వేశారు. జై నేతన్న.. జై నేతన్న అనే నినా దాలు చేశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ప్రజా ప్రభుత్వం అందిస్తున్న వివిధ ఆర్డర్లు, యార్న్ బ్యాంకు, స్కూల్ యూనిఫాం, విద్యుత్ సబ్సిడీ అంశాలను పలువురు ప్రజా ప్రతినిధులు గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుపై హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఏడీ రాఘవరావు, వస్త్ర పరిశ్రమ యజమానులు, ఆసాములు, నేత కార్మికులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# అధికారుల అలసత్వం.. లబ్ధిదారులకు శాపం




**జనం పవర్, భీమదేవరపల్లి, ఆగస్టు 7:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తెచ్చిన ఇందిరమ్మ ఇళ్ళ పథకం మండలంలో ఆచరణలో అనుకున్న ఫలితాలు ఇవ్వట్లేదు. ముఖ్యమంత్రి వరమిచ్చినా కార్యదర్శి కరుణించలేదు అన్న చందంగా మండల వ్యాప్తంగా నెలకొంది. సెక్రటరీకి మండల గృహనిర్మాణ శాఖ సహాయక ఇంజినీర్ తోడవడంతో వారి ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తమకు ఆరోగ్యం బాగోలేదని, లేదా తాము సెలవులో ఉన్నామని చెబుతూ నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్దిదారులకు పట్టపగలు చుక్కలు చూపుతున్నారు. తాము నిర్మాణాలు పూర్తి చేసుకున్నా. గృహ నిర్మాణ శాఖ, పంచాయతీ అధికారులు ప్రగతిని సంబంధిత యాప్‌లో నమోదు చేయకుండా జాప్యం చేస్తున్నారని మండలంలోని లబ్ధిదారులు వాపోతున్నారు. ఈ విషయమై మండల గృహ నిర్మాణ శాఖ సహాయక ఇంజనీర్ గారిని ఫోన్ ద్వారా సంప్రదించగా నిర్లక్ష్యంగా మాట్లాడారు.

# మధ్యాహ్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు




డిండి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలపై డిండి ఎంఈఓ కార్యాలయం, ముందు ధర్నా నిర్వహించిన అనంతరం, ఎంఈఓ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగాఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వంట కార్మికులు గత 22 సంవత్సరాల, నుండి విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తున్నరు.వారి జీవితాలు, మాత్రం, నెలల తరబడి ఎక్కడ వేసిన గొంగడి అక్కడ ఉన్నట్టుగానే ఉన్నది.ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించే విషయంలో నత్త నడకగా వ్యవహరిస్తుందని ఆయన, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వంట బకాయి 4 5 నెలల బిల్లులు ,జీతాలు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వ హామీలో భాగంగా 10,000 రూపాయల వేతనం ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్, సౌకర్యాలను కల్పించాలని కోడిగుడ్లను,వంట గ్యాస్ ను ప్రభుత్వమే సరఫరా చేయాలని,యూనిఫారం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని,ప్రతి విద్యార్థికి తరగతి తో,సంబంధం లేకుండా రోజుకు 25 రూపా యలు చెల్లించాలని, ప్రతి నెల 5తేదీ వరకు, జీతాలు చెల్లించాలని, ద్యోగ భద్రత కల్పించాలని అధికారుల, రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25 తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, హెచ్చరించారు.. ఏఐటియుసి మండల అధ్యక్షుడు బుష్పాక లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

# చెత్త తొలగించరు.. దుర్వాసన పోదు..

●ప్రధాన రోడ్డు పక్కన చెత్తకుప్పలు
●నిర్లక్ష్యంలో అధికారులు

**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 7:** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఎక్కడ చెత్త అక్కడే పేర్కుపోయి ఉండడం వల్ల వాటి నుండి వచ్చే దుర్వాసనతో ప్రజలు సతమతమవుతున్నారు. కార్పొరేషన్ పరిధి లోనే కాకుండా ఆయా మండలాల పరిధిలోని పలు గ్రామపంచాయతీలో కూడా పారిశుద్యం అస్తవ్యస్తంగా తయారైంది. పేరుకుపోయిన చెత్తకుప్పలు వానకు తడిసి ఎండకు ఎండి కుళ్ళి కంపు కొడుతుండడంతో ఆ ప్రాంత ప్రజలు బేజారవుతున్నారు. ప్రతిరోజు పారిశుద్య సిబ్బంది వీధుల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించే విషయంలో నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తున్నారనే వాదన ప్రజల నుండి వినబడుతుంది. అధికారుల పర్యవేక్షణ లేని కారణంగానే కార్పొరేషన్ గ్రామపంచాయతీలలో పారిశుద్యం వ్యవస్థ దారుణంగా తయారైందని మండిపడుతున్నారు. చెత్త నుంచి దోమలు విజృంభించడంతో రాత్రి సమయంలో జాగారం చేయాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమకాటు వల్ల అనేక మందికి విష జ్వరాలు సోకి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. వర్షాకాలం అంటేనే వ్యాధుల సీజన్ అని అధికారులు తెలిసినప్పటికీ ముందస్తుగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విచారకరమని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**బాబు క్యాంపులో చెత్తకుప్పలు దర్శనం..**

చుంచుపల్లి మండల పరిధిలోని పలు వీధుల్లో



పేరుకుపోయిన చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. రోజుల తరబడి చెత్తకుప్పలు అలానే కనబడుతున్నాయి తప్ప వాటిని తొలగించే వారే కరువయ్యారు. మెయిన్ రోడ్డుపైనే చెత్తకుప్పలు ఇలా ఉంటే వార్డుల్లో ఇంకా ఎలా ఉంటుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బాబు క్యాంప్ మెయిన్ రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## గోమాస శ్రీకాంత్ ఖబడ్దార్..!
### నోరుజారితే బాగుండదు



**జనంపవర్, మంచిర్యాల, ఆగస్టు 7:** గోమాస శ్రీకాంత్ ఖబడ్దార్..! నోరుజారితే బాగుండదు.. అని బీఆర్ ఎస్ పార్టీ నాయకులు అన్నారు. గురువారం వారు మంచిర్యాలలో మాటాడుతూ బెల్లంపల్లి మండలం మాలగురిజాల గ్రామ పంచాయతీకి చెందిన కాంగ్రెస్ నాయకుడు గోమాస శ్రీకాంత్ నిన్న సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో ద్వారా మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య భూకబ్జాలు చేశారని, మానభంగాలు చేశారని నిరాధారమైన ఆరోపణలు చేశాడు. పూటకొక పార్టీ మార్చే ఊసరవెల్లిలాంటి గోమాస శ్రీకాంత్ కు మా నాయకుడు దుర్గం చిన్నయ్య గురించి మాట్లాడే అర్హత ఏమాత్రం లేదని అన్నారు. గోమాస శ్రీకాంత్ ఇదివరకు మంచిర్యాలలో ఒక వికలాంగున్ని మోసం చేసినందుకు దెబ్బలు తిని మంచిర్యాల నుండి పారిపోయి వచ్చాడని, బెల్లంపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేసినప్పుడు అనేక అవకతవకలకు పాల్పడ్డాడని ఆరోపించారు. దుర్గం చిన్నయ్యపై చేసిన ఆరోపణలను గో మాస శ్రీకాంత్ తక్షణమే రుజువు చేయాలని, లేకుంటే దుర్గం చిన్నయ్యను బహిరంగ క్షమాపణ కోరాలన్నారు. క్షమాపణలు చెప్పకుంటే గోమాస శ్రీకాంత్ ఇంటిని ముట్టడిస్తామని, ఆయనను బయట తిరగనివ్వకుండా చేస్తామని హెచ్చరించారు. గోమాస శ్రీకాంత్ ఖబడ్దార్.. నువ్వు దుర్గం చిన్నయ్యకు వెం టనే బహిరంగ క్షమాపణ చెప్పకుంటే బట్టలూడదీసి కొడ తామని బీఆర్ ఎస్పార్టీ నాయకులు గోమాస రాజం, కోట అనంతం, పంజాల శ్రీనివాస్గౌడ్, గోమాస వినోద్ తదితరులు హెచ్చరించారు.

## సహకార సంఘాల సమీక్ష సమావేశం

**జనం పవర్, జగిత్యాల, ఆగస్టు 07:** జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో యూరియా విక్రయాలపై గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా సహకార అధికారి సి. హెచ్. మనోజ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వి.భాస్కర్ సంయుక్తంగా నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లాలోని సహకార సంఘాలలో యూరియా నిల్వలు, విక్రయాలను సంఘాల కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లో యూరియా నిల్వలను ప్రదర్శించాలని, యూరియాను గరిష్ట చిల్లర ధరకు మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. రైతుల పంట విస్తీర్ణం ఆధారంగా యూరియాను విక్రయించా లన్నారు. యూరియా విక్రయాల్లో అవకవతవకలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ.. యూరియా విక్రయాల విషయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని సూచించారు. సమావేశంలో ఇఫ్కో జిల్లా మేనేజర్ శ్రీధర్ సహకార శాఖ ఆడిట్ అధికారి ఏం.సత్యనారాయణ అధికారులు పాల్గొన్నారు.

## కరీంనగర్ శాసనసభ ఎన్నికల సమీక్ష సమావేశం



**జనం పవర్, కరీంనగర్, ఆగస్టు 07:** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశానుసారం కరీంనగర్ శాసనసభ నియోజకవర్గ ఎన్నికల సమీక్ష సమావేశం గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, రెవెన్యూ డివిజనల్ అధికారి మహేష్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగింది. వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఎన్నికల అంశాల గురించి ఈ సమావేశంలో చర్చించారు. కాంగ్రెస్ పార్టీ నుండి మడుపు మోహన్,బిజెపి నుండి గుగ్గిలపు రమేష్, నాంపల్లి శ్రీనివాస్, టిఆర్ఎస్ నుండి సత్తినేని శ్రీనివాస్, టిడిపి నుండి కళ్యాడపుఆగయ్య, సిపిఎం నుండి వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

## సింగరేణి సీపీఆర్వోకి జాతీయస్థాయి
# ఉత్తమ పిఆర్ మేనేజర్ పురస్కారం

**సీఎండీ ఎన్.బలరామ్ అభినందనలు**



**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 7:** సింగరేణి సంస్థలో ముఖ్య ప్రజా సంబంధాల అధికారి, జీఎం(కో ఆర్డినేషన్) ఎస్.డి.ఎం సుభాని ప్రతిష్టాత్మక డాక్టర్ సివి నరసింహారెడ్డి-పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా వారి జాతీయ స్థాయి ఉత్తమ పిఆర్ మేనేజర్-2025 పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ లో గురువారం ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ హాల్ లో జరిగిన నేషనల్ పబ్లిక్ రిలేషన్స్ ఎడ్యుకేషన్ డే ఉత్సవంలో ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ ఘంటా చక్రపాణి ఈ అవార్డును ఎస్.డి.ఎం.సుభానికి ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటల్ మేనేజ్మెంట్ (నిథమ్) డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకట రమణ, పిఆంఎస్ఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ అజిత్ పాఠక్, పబ్లిక్ రిలేషన్స్ వాయిస్ పత్రిక ఎడిటర్ వై.బాబ్జి, పిఆర్ఎస్ఐ హైదరాబాద్ ఛాప్టర్ అధ్యక్షులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు. సింగరేణి సంస్థలోని 12 ఏరియాలలో ప్రజా సంబంధాలను పటిష్టంగా నిర్వహిస్తూ సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ కార్మికులను చైతన్యపరచడంలో సమాజంలో మంచి గుర్తింపు తీసుకురావడంలో ఎస్.డి.ఎం సుభాని సీపీఆర్వో హెూదాలో తమదైన పాత్రను పోషించారని కొనియాడారు. ముఖ్యంగా కమ్యూనికేషన్ మాధ్యమాలైన కరపత్రాలు పోస్టర్లు సోషల్ మీడియా హ్యాండిల్స్ వారం వారం సింగరేణి ప్రవంతి వంటి అనేక కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తూ ద్విముఖ కమ్యూనికేషన్ ను విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు గుర్తింపుగా ఈ అవార్డును సింగరేణి సీపీఆర్వో ఎస్.డి.ఎం సుభానికి బహూకరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేశంలో బొగ్గు పరిశ్రమల్లో సింగరేణి సంస్థ ప్రజా సంబంధాలు ఆదర్శప్రాయంగా ఉన్నాయని ప్రజా సంబంధాల విభాగంలో గల అన్ని రకాల మాధ్యమాలను సింగరేణి పబ్లిక్ రిలేషన్స్ శాఖ సమర్థంగా వినియోగిస్తూ వస్తోందని నిర్వాహకులు కొనియాడారు.

**సీఎండీ ఎన్. బలరామ్ అభినందనలు...**

ఎస్డిఎం సుభానికి జాతీయ స్థాయిలో ఉత్తమ పిఆర్ మేనేజర్ అవార్డు రావడం పట్ల సంస్థ సీఎండీఎన్.బలరామ్ తన అభినందనలు తెలిపారు. ఇది సింగరేణిలో సంక్షేమ అభివృద్ధి కార్యక్ర మాలను ఎప్పటికప్పుడు కార్మికులకే కాకుండా ప్రజలకు తెలియజేయడంలో సింగరేణి ప్రజా సంబంధాల శాఖ చేస్తున్న కృషికి లభించిన గుర్తిం పు అని ప్రశంసించారు. అంతర్జాతీయ స్థాయికి సింగరేణిని తీసుకెళ్లాలన్న లక్ష్యాలకు అనుగుణంగా కార్మికులను సన్నద్ధం చేయడంలో ప్రజా సంబంధాల విభాగం కృషి చేయాలని ఆకాంక్షించారు.

## అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలి

**– బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు రామగౌని మహిధర్ గౌడ్**



**జనం పవర్, బెల్లంపల్లి, ఆగస్టు 7:** అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించి నిర్మాణానికి తోడ్ప డాలని బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు రామగౌని మహిధర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరుగుతుందని, అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర వర్గాలకు సంబంధించిన నిరుపేదలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి నిరుపేదకు ఇల్లు ఇస్తామని ఇచ్చినటువంటి హామీని నిలబెట్టుకోవాలని లేని యెడల బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చ రించారు. ఆర్టీసీలో మహిళల ఉచిత ప్రయాణాన్ని స్వాగతిస్తున్నామని, ఆటో డ్రైవర్ల స్థితిగతులను దృష్టిలో పెట్టుకొని వారి కి ప్రభుత్వం అండగా నిలబడాలని అన్నారు. ఆటో డ్రైవర్లకు ఉపాధి లేకుండా చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానా లలో పోటీ చేస్తుందని, ప్రజల ఆశీస్సులు బీజేపీ వైపు ఉన్నా యని అన్నారు.

# ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

**జనం పవర్, మంచిర్యాల,ఆగస్టు 7:** గురువారం రోజున మంచిర్యాల జిల్లా కేంద్రంలో 11 వ జాతీయ చేనేత దినోత్సవాన్ని శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి స్వచ్ఛంద సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమాలో హాజీపూర్ మండల్ పడ్తన పెల్లి గ్రామానికి చెందిన చిందం లింగయ్య , అంకం లచ్చయ్య చేనేత కార్మికులకు పూల బోకేలు అందజేసి శాలువతో ఘనంగా సన్మానము చేసినారు. ఈ సందర్భంగా పలువురు సంఘం నాయకులు మాట్లాడుతు చేనేత అంటేనే చైతన్యం అని అలాంటి చేనేత కార్మికులను ప్రభుత్వాలు ఓట్ల కోసం వాడుకుంటున్నాయి తప్ప వారి సంక్షేమం కోసం ఆలోచించిన దాఖలాలు లేవు అని, చేనేత అంటే వృత్తి కాదు అది మన అస్తిత్వం అని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం వెయ్యి కోట్ల బడ్జెట్ను విడుదల చేయాలని, చేనేత పై జి స్ టీ రద్దు చేయాలని , జాతీయ చేనేత బోర్డు ను పునరుద్ధరించలని ప్రభుత్వాలను డిమాండ్ చేసారు. అదే విధంగా పద్మశాలీయులు చేనేత కార్మికులు, రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలి అని మేమెంతో మకాంత వాట కొరకు రాజ్యాధికారంలో వాటకొరకు తెలంగాణ జాతిపిత చేనేత సహకారోద్యమ పితమహుడు కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో పోరాడాలని, రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ, మరియు జడ్పీటీసీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో మన పద్మశాలీయుల సత్తా చాటాలని అన్నారు. పోగును వస్త్రంగా మలిచి మనిషి మనాన్ని కాపాడేది చేనేత వృత్తి అని, చేనేత వస్త్రాలనే ధరిద్దాం నేత అన్నలకు అండగా ఉందాం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, పడ్తన పల్లి గ్రామ మాజీ సర్పంచ్ అంకం కృష్ణమూర్తి , పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు అడిచర్ల సాగర్, కె మమత రాణి, సంఘం నాయకులు చెరుకు నారాయణ, చెట్టు పెల్లి లక్ష్మి రాజం, దాసరి మల్లయ్య, చిందం రాజలింగు, తిరుపతి, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు .



## స్త్రీనిధి నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ ఆగ్రహం



**జనం పవర్, పెద్దపల్లి ఆగస్టు 7:** స్త్రీ నిధి నిధుల దుర్వినియోగంపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్లో జరిగిన ఈ సమావేశానికి నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వీవోఏలు, ఓబీలు, సంబంధిత క్లస్టర్ కోఆర్డినేటర్లు (సీసీలు), స్త్రీ నిధి సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ గారు తీవ్రంగా స్పందిస్తూ, నిధుల దుర్వినియోగం చేసిన వీవోఏలు, ఓబీలు 15 రోజుల్లోపు సంబంధిత మొత్తాన్ని తిరిగి స్త్రీ నిధికి చెల్లించకపోతే, రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం ఆస్తులు జప్తు చేయడం సహా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఇకపై ప్రతి గ్రామ మహిళా సంఘం, స్వశక్తి సంఘాల్లో స్త్రీ నిధి నిధుల నిర్వహణ పూర్తి పారదర్శకంగా ఉండాలని, అన్ని లావాదేవీలూ నమోదు చేసి, పర్యవేక్షణను కచ్చితంగా అమలు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందిని, అదనపు డిఆర్డిఓ బి.రవీందర్, స్త్రీ నిధి రీజినల్ మేనేజర్ దుర్గాప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో "రాఖీ" సందడి



**కిక్కిరిసిన పెద్ద బజార్**
**దుకాణాల్లో కొనుగోలుదారుల సందడి**

**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 7:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని రాఖీ సందడి మొదలైంది. శనివారం రాఖీ పండుగ ఉండడంతో మహిళలు దుకా ణాలకు వచ్చి రాఖీలను కొనుగోలు చేస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలోని పెద్ద బజార్ చిన్న బజార్ ఎంజి రోడ్ గణేష్ టెం పుల్ ఏరియా తదితర ప్రాంతాలలో రాఖీ దుకాణాలు వెలిశాయి. గత రెండు రోజుల నుండి రాఖీలకు గిరాకి పెరిగింది. దీంతో రా ఖీ దుకాణాలు కళకళలాడుతున్నాయి. చిన్నారుల నుండి మొదలుకొని పెద్దల వరకు వివిధ రకాల రాఖీలను దుకాణదారులు అందుబాటులో ఉంచారు. రాత్రి సమయంలో విద్యుత్లైటింగ్ ఏర్పాటు చేయడంతో రాఖీ దుకాణాలు ఆకర్షణగా కనిపిస్తున్నాయి.



## నోట్ బుక్స్ పంపిణీ చేసిన తహసీల్దార్



**జనం పవర్ జమ్మికుంట ఆగస్ట్ 9:** జమ్మికుంట మండలంలోని బిజిగిరి షరీఫ్ గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో, మండల తహసీల్దార్ వెంకట్ రెడ్డి విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకుని మంచి మార్కులతో పాస్ కావాలని సూచించారు. ఆర్ఐ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# బీసీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం

**జనం పవర్, వనపర్తి,ఆగస్ట్ 7 :** వెనుకబడిన కులాల సమాఖ్య (బీసీఎఫ్) ప్రాథమిక క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం వనపర్తి పట్టణంలోని బాలానగర్లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిసిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నాగనమోని చెన్నరాములు ముదిరాజ్ హాజరైనారు. పుట్టపాకుల బాలస్వామి మొదటి సభ్యత్వం తీసుకున్నారు. వరుసగా బిసిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్లాడి భగవంతుగౌడ్, కే.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రామన్ గౌడ్ మాజీ ఎంపీటీసీ, రాష్ట్ర కార్యదర్శి ఏర్పుల తిరు పతి యాదవ్, జిల్లా అధ్యక్షులు పెల్లి విల్లా తిరుపతయ్య యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు వి. సురేందర్ బాబు, వనపర్తి పట్టణ నాయకులు బొడ్డుపల్లి మన్నెం, ఉందేకోటి బీసన్న, ఉందేకోటి వెంకటస్వామి, బొడ్డుపల్లి కుమార్ ,బొడ్డుపల్లి తిరుపతయ్య సభ్యత్వం తీసుకున్న వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా చెన్న రాములు ముదిరాజ్ మాట్లాడుతూ గత 78 సంవత్సరాలుగా హక్కులు ఆత్మగౌరవం అధికారం విద్య ఉద్యోగం ఉపాధి లేకుండా దారిద్రరేఖకు దిగువన జీవిస్తున్న బీసీలు కులవృత్తులను నమ్ముకొని జీవన విధ్వంసమై ఆకలి చావులు, ఆత్మహత్యలు వలస చావులు నిత్యకృత్యం అయినాయి. కాబట్టి కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం మాటకు కట్టుబడి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని నిర్ణయించి తీర్మానించి రాష్ట్రపతి దగ్గరికి పంపించడం జరిగింది. కేంద్రంలోని బిజెపి పార్టీ పార్లమెంటులో బిల్లును ఆమోదం చేసి రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్లో చేర్చి చట్టబద్ధమైన రిజర్వేషన్లు ఇవ్వాల్సి ఉంది కానీ బిజెపి ఏవో కుంటి సాకులు చెబుతూ కాపీ వేస్తున్నారు కాబట్టి వీరిపై వర్ధిలు తీసుకు రావడానికి ఢిల్లీలో ఈనెల 5,6,7 తేదీల్లో కాంగ్రెస్ పార్టీ 72 గంటల దీక్ష చేపట్టారు. కాబట్టి ఇప్పటికైనా బిజెపి దేశవ్యాప్తంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి ఇవ్వాలి అన్నారు. అదేవిధంగా తెలంగాణ రాబిన్ ఫుడ్ పేద ప్రజలకు పెన్నిధి ప్రజా బంధువు పండుగ సాయన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై పెట్టాలని సాయన్న జయంతి వర్ధంతిలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని డిమాండ్ చేశారు.




## పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు

**జనం పవర్,బైంసా, ఆగస్టు 7:** నిర్మల్ జిల్లాలోని నర్సాపూర్ మండల కేంద్రం లో నిబంధనలకు విరుద్ధంగా హాజరు యాప్‌లో పాత ఫోటోలను అప్లోడ్ చేసినందుకు మండల ఎంపీఓ, ఐదుగురు గ్రామ కార్యదర్శిలకు జిల్లా అధికారులు నోటీసులు జారీ చేశారు. పనిచేసే ప్రదేశంలో నేరుగా తీసుకున్న ఫోటోలను అప్లోడ్ చేయవలసి ఉండగా, వీరి పాత ఫోటోలను ఉపయోగించడంతో పై అధికారులు గమనించి వారిని నోటీసులు ఇచ్చారు. ఈ క్రమశిక్షణరాహిత్యం పై అధికారులు కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధమయ్యారు. అందుకే ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేస్తే వారి ఉద్యోగానికి హాని ఉందని తెలియజేశారు. ప్రతి ఒక్క ఉద్యోగి క్రమశిక్షణతో, సమయపాలన పాటిస్తూ ప్రజలతో కలిసిమెలిసి ఉండి తన ఉద్యోగాన్ని సక్రమంగా నిర్వహించాలని అధికారులు అన్నారు.

## సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అజ్మీర సంకేత్ కుమార్



**జనం పవర్, బైంసా, ఆగస్టు 7:** బైంసా డివిజన్ సబ్ కలెక్టర్ గా అజ్మీరా సంకేత్ కుమార్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గురువారం ఉదయం వేళలో హైదరాబాద్ నుండి ఉద్యోగ బాధ్యతలు స్వీకరణ కోసం భైంసాకు తరలివచ్చారు. మార్గమధ్యలో బాసర శ్రీ సరస్వతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. అక్కడినుండి బైంసాలోని కార్యాలయనికి ఉద్యోగ బాధ్యతలు స్వీకరణ కోసం తరలివచ్చారు. బైంసా డివిజన్ ఆర్డీవో కోమల్ రెడ్డి, భైంసా మండల ఎమ్మార్వో ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో భైంసా డివిజన్ అన్ని మండల కేంద్రాల ఎమ్మార్వోలు, ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయ అధికారులు,సిబ్బంది, భైంసా డివిజన్ సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ ఐఏఎస్ గారిని పుష్పగుచ్చల అందించి స్వాగతం పలికారు. అనంతరం సబ్ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో కోమల్ రెడ్డి నుండి సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమా ర్ ఐఏఎస్ బాధ్యతలు స్వీకరించారు. వివిధ మండల ఎమ్మార్వోలతో ముఖాముఖి పరిచయాలు చేసుకున్నారు. భైంసా డివి జన్ సబ్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అజ్మీర సంకేత్ కు మార్ ఐఏఎస్ కు ముధోల్ నియోజకవర్గం పరిధిలోని ఆయా మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యోగ శుభాభివందనాలు తెలియ జేశారు.

## ధ్రువీకరణ పత్రాల జారీలో ఆలస్యం వద్దు

**- కలెక్టర్ అభిలాష్ అభినవ్**



**జనంపవర్, భైంసా, ఆగస్టు 7:** నిర్మల్ జిల్లాలోని ఉన్న మండల కార్యాలయాల్లో ప్రజలు దరఖాస్తు చేసుకునే ఏ విధమైన పౌర సేవల ధ్రువీకరణ పత్రాలను వేగవంతంగా అందించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులకు ఆదేశించారు. కుల, ఆదాయ, నివాస, మరణా, జనన, వివిధ ధ్రువపత్రాలు దరఖాస్తు చేసుకున్న వెంటనే పరిశీలించి అందజేయాలని సూచించారు. మండల వారీగా పెం డింగ్లో ఉన్న వివరాలను సమీక్షించారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా పూర్తి చేయా లన్నారు. ఈ దరఖాస్తు పరిశీలన చేయకుండా పెండింగ్లో ఉంచినట్లయితే చర్యలు తీసుకుంటమన్నారు. అదేవిధంగా ని ర్మల్ జిల్లాలోని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) డెలివరీ సకాలంలో పూర్తి చేయాలని మిల్లర్లపై రెవెన్యూ రికవరీ చట్టాన్ని ఉపయోగించాలని కలెక్టర్ అభిలాష్ అభినవ్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సదరు మిల్లర్ల ఆస్తులను స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమ సమావేశంలో జిల్లా కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, నిర్మల్ ఆర్డిఓ రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

## అయోధ్య సేవలు చిరస్మరణీయం

**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 7:** సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ దివంగత బొల్లోజు అయోధ్య చారి ఆకస్మిక మరణం పట్ల ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ సంతాపం సానుభూతిని తెలియజేస్తూ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మద్దెల మాట్లాడుతూ అయోధ్య ఒక సామాన్య కూలీ కుటుంబం నుండి జన్మించి అభ్యుదయ భావాలతో మొక్కవోని దీక్షతో కటోర పరిశ్రమతో పోరాట పటిమతో సిపిఐ పార్టీలో అంచెలంచలుగా ఎదిగి ప్రస్తుతం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఉన్నతమైన స్థాయిలో సేవలందిస్తూ జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ గా కూడా కొనసాగి కార్మిక కర్షక పేద వర్గాల కోసం బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేయడం జరిగిందన్నారు. కమ్యూనిస్టు పార్టీలో సేవలందిస్తూ నిబద్ధత నిజాయితీ నాయకుడిగా అందరి హృదయాలలో స్థానం సంపాదించిన అయోధ్య మరణం తీరని లోటని అన్నారు. అయోధ్య అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని వారి కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపాన్ని సానుభూతిని తెలియజేస్తున్నట్లు మద్దెల శివకుమార్ పేర్కొన్నారు.ఆచార్య డాక్టర్ మద్దెలతో పాటు సంఘ నాయకులు మాజీ జెడ్పిటిసి సభ్యులు గిడ్ల పరంజ్యోతి రావు, ఆదివాసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాసం రామకృష్ణ, అపరబాలు అల్లిశంకర్, సినీ నటులు తాండూర్ ధనరాజ్, చిరంజీవి సేవా సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి.విల్సన్ బాబు, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా నాయకులు లావుడియా సత్యనారాయణ, గుగులోత్ కృష్ణ, బోడ గణేష్, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు జోసఫ్, ముస్లిం మైనారిటీ నాయకులు తోత పాషా ఉన్నారు.

## జయశంకర్ సార్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో

# బీఆర్ఎస్ పార్టీ అత్యుత్సాహం

**- అందరివాడిని, కొందరివాడిగా మార్చారంటున్న ప్రజలు**

**జనం పవర్, మందమర్రి, ఆగస్టు 7:** మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ ప్రధాన కూడలిలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, దేశపతి శ్రీనివాస్, డాక్టర్ రాజా రమేష్, పట్టణానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు. ఇంతవరకు బాగానే ఉంది. ఇంత గొప్ప తెలంగాణ ఉద్యమకారుడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి మిగతా పార్టీలకు ఆహ్వానం పలికారా.. లేదా.. అంతే కాకుండా.. పట్టణంలోని వివిధ కుల సంఘాలను, రాజకీయ నాయకులను పిలిచారా..? లేదా..? ఒక గొప్ప కార్యక్రమం చేసినప్పుడు పట్టణంలోని వివిధ పార్టీలు, కుల సంఘాలకు చెందిన వారిని ఆహ్వానించి, పట్టణ కమిటీ ఏర్పాటు చేసి, ఈ కార్యక్రమంలో పట్టణంలో నివసిస్తున్న సబ్బండ వర్గాల ప్రజలందరూ భాగస్వామ్యమయ్యేవిధంగా చూస్తే బాగుండేది అంటూ పట్టణ ప్రజలు బహిరంగంగానే చెప్పుకొంటున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ ఏ పార్టీకి చెందిన వాడు కాదు, ఆయన కేవలం తెలంగాణ ఆశయ సాధనకై అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు. ఈ కార్యక్రమం ఇలా నిర్వహించినందుకు సంతోష పడాలా..? ఏ పార్టీ, ఏ కులానికి, సంఘానికి ప్రాధాన్యం ఇవ్వనందుకు బాధపడాలా.. అర్థం కాని పరిస్థితి దాపురించింది. ఈ కార్యక్రమం వల్ల జయశంకర్ సార్.. కేవలం బీఆర్ఎస్ పార్టీవాడిగా చిత్రీకరించినట్లు అయిందని పట్టణానికి చెందిన మేధావులు పేర్కొంటున్నారు. కార్యక్రమం ఎంత అద్భుతంగా నిర్వహించినా ప్రత్యేక తెలంగాణ పోరాటంలో అన్ని పార్టీలు, అన్ని కుల సంఘాలు, విద్యార్థులు విద్యావంతులు, మేధావులు కలిసికట్టుగా రోడ్లపైకి వచ్చి ఉద్యమించారనేది యాది మరిచారా.. లేదా మరిపిస్తున్నారా..? అని ప్రశ్నిస్తున్నారు పట్టణ ప్రజలు. ఆనాడు ఉద్యమం చేసింది కేవలం బీఆర్ఎస్ పార్టీ ఒక్కటే.. పోరాటం చేసి, సాధించి పెట్టింది అన్నట్లుగా చిత్రీకరించడం సబబు కాదు అంటున్నారు వివిధ పార్టీల నాయకులు.



# ముందుకు కదలని వైకుంఠ రథం

- ♦ కార్మిక శాఖ మంత్రి ఇలాకాలో ఇబ్బంది పడుతున్న పట్టణ ప్రజలు
- ♦ జనాభాకు తగ్గట్టుగా వైకుంఠ రథాలు ఫ్రీజర్ల కరువు



**జనం పవర్, మందమర్రి, ఆగస్టు 7:** మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో గత కొన్ని నెలలుగా మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో గల వైకుంఠ రథంలు ముందుకు కదలనంటు న్నాయి. దాదాపు 60 వేల మంది జనాభా ఉండగా పట్టణ జనాభాకు సరిపోను వైకుంఠ రథాలు గాని, ఫ్రీజర్లు గాని లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆఖరి మజిలీకి అందుబాటులో ఉండాల్సిన వైకుంఠ రథాలు అందుబాటులో లేక మందమర్రి పట్టణ వాసులకు తీవ్ర ఇబ్బంది కలు గుతుందనీ, తుదిశ్వాస విడిచిన వారి దేహాలను భద్రపరచడానికి వాడే ఫ్రీజర్స్ పనిచేయడం లేదు. మున్సిపాలిటీ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని, వైకుంఠ రథాలు, ఫ్రీజర్స్ తగినన్ని పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై పట్టణ ప్రజలు, పలు కుల సంఘాల నాయకులు, పట్టణంలోని పలు కాలనీలకు చెందిన ప్రజలు అభిప్రాయపడ్డారు.

# సమస్యలు పరిష్కరించాలని రైల్వే జీఎంకు వినతి



**జనం పవర్, మంచిర్యాల, ఆగస్టు 7:** మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని, రైల్వే స్టేషన్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని రైల్వే జీఎంకు వినతి పత్రం అందించిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రఘునాథ్ వెరబెల్లి. మంచిర్యాలలో నాగపూర్-సికింద్రాబాద్ వందే భారత్ రైలు నిలుపుదల చేయాలని, తిరుపతి వెళ్లి భక్తుల సౌకర్యార్థం మంచిర్యాల - తిరుపతి నూతన రైలు మంజూరు చేయాలని, చెన్నయ్ సెంట్రల్- జోధ్‌పూర్ రైలుకు మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వాలని మరియు హమాలివాడ మూతపడ్డ రైల్వే గేట్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ గురువారం సికింద్రాబాద్ రైల్‌నిలయంలో రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీ వాస్తవకు ఎమ్మెల్సీ అంజి రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ వెరబెల్లి, మంచిర్యాల మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్ వినతి పత్రం అందించినట్లు తెలిపారు. మంచిర్యాల రైల్వే స్టేషన్ ఎన్ఎస్‌జీ-3 కేటగిరీలో ఉంది ఏడాదికి 23 కోట్ల రూపాయల పైగా ఆదాయం మరియు 13 లక్షలకు పైగా ప్రయా ణికులు వెళ్తున్నప్పటికీ ఇక్కడ వందే భారత్ రైలు, ఇతర రైళ్లు మాత్రం నిలువడం లేదని వారికి వివరించారు.

మంచిర్యాల జిల్లా నుండి అనేక మంది వ్యాపారస్తులు మరియు ప్రజలు నిత్యం ఉత్తర మరియు దక్షిణ భారత దేశం వైపు ప్రయాణం చేస్తుంటారని అయినప్పటికీ ఇక్కడ ప్రధాన రైళ్ళకు హాల్టింగ్ లభించడం లేదని జీఎంకు తెలియ చేశామని తెలిపారు. మంచిర్యాలలో నాగపూర్ - సికిం ద్రాబాద్ రైలు మంచిర్యాలలో రైలు నిలుపుదల చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని రైల్వేకు ఆదాయం వస్తుందని తెలిపారు. చెన్నై సెంట్రల్ నుండి భగత్ కి కోటి (జోధ్‌పూర్) వెళ్లే వీక్లీ రైలు వరంగల్ తర్వాత బల్లార్షాలో హాల్టింగ్ ఉందని, కావున రాజస్థాన్ వెళ్ళే ప్రయాణికుల సౌకర్యం కోసం మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో రైలుకు హాల్టింగ్ ఇవ్వాలని కోరారు.

మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల నుండి నిత్యం వేల మంది ప్రజలు తిరుపతి వెంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్తూ ఉంటారని అయినప్పటికీ మంచిర్యాల నుండి తిరుపతికి రైలు లేకపోవడంతో ఇక్కడి ప్రయాణికులు కరీంనగర్, వరంగల్ వెళ్లి రైలు ఎక్కాల్సిన పరిస్థితి ఉందని కావున మంచిర్యాల నుండి తిరుపతికి నూతన రైలు ఏర్పాటు చేస్తే రైల్వేకు ఆదాయంతో పాటు ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు.

మంచిర్యాల పట్టణం హమాలివాడ అండర్ బ్రిడ్జి నిర్మాణం అనంతరం రైల్వే గేట్ మూసివేయడంతో నిత్యం టుటౌన్ కు వెళ్లే పాదచారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సౌకర్యార్థం రైల్వే గేట్ వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరినట్లు తెలిపారు.

## నిర్మల్ జిల్లా కలెక్టర్‌ను కలిసిన సబ్ కలెక్టర్

**జనం పవర్ ,బైంసా, ఆగస్టు 7:** నిర్మల్ జిల్లాలోని బైంసా డివిజన్లో సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అజ్మీర సంకేత్ కుమార్ ఐఏఎస్ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాషఅభినవ్ ఐఏఎస్ గారిని కలెక్టరేట్లోని తన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్ సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్‌ను శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారిద్దరూ ఇరువురి జిల్లా స్థితిగతులపై చర్చించారు. నిర్వహించే విధి నిర్వహణలో సమర్థవంతంగా వివరించాలని సబ్ కలెక్టర్ను కలెక్టర్ సూచించారు. ముందుగా సమయపాలన పాటించి తోటి ఉద్యోగులతో, ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. భైంసా డివిజన్ అభివృద్ధి బాటలో ప్రయాణించేటట్టు చూడాలన్నారు. నాపై ఉన్న బాధ్యత ను సమర్థవంతంగా నిర్వహిస్తానని, ప్రజలకు న్యాయం చేసే విధంగా ప్రవర్తిస్తారని సబ్ కలెక్టర్ ,కలెక్టర్ నను హామీ ఇచ్చారు.

## ఆర్జీయూకేటీలో స్పోర్ట్స్, ఎన్సిసి జాబితా విడుదల

**జనం పవర్, బైంసా ,ఆగస్టు 7:** ఆర్జీయూకేటీ పరిధిలోని బాసర, మహబూబ్నగర్ క్యాంపస్ లలో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశల కోసం స్పోర్ట్స్, ఎన్సిసి కోట తో పాటు జనరల్ కోట అభ్యర్థుల ఐదో జాబితాను విడుదల చేశారు.

ఆగస్టు నెల 8వ తేదీన కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు క్యాంపస్ అధికారులు తెలియజేశారు. అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో ఉదయం 9 గంటలకు బాసర క్యాంపస్‌కు చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం www.admissions.rgukt.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో వేసి గోవర్ధన్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించిన పోలీసులు

**జనం పవర్, బైంసా,ఆగస్టు 7:** బాసర మండల కేం ద్రంలోని ఉన్న ప్రభుత్వ పాఠశాలలో నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల గారి ఆదేశాల మేరకు బాసర పోలీస్‌లు అవేర్నెస్ ప్రో గ్రాం ఏర్పాటు చేశారు. సైబర్ క్రైమ్, గంజాయి, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, అదేవిధంగా గుర్తుతెలియని వ్యక్తులకు ఓటిపిలు చెప్పడం, మొబైల్ ఫోన్ల వాడకన్నీ తగ్గించాలని, చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, విద్యార్థులకు బాసర ఎస్సై శ్రీనివాస్ సూచించారు. విద్యార్థి దశలో ఒకసారి క్రైమ్ కేసుబుక్ అయితే లైఫ్ లో చాలా నష్ట పోతారని, జాబ్ విష యంలో పోలీస్ వెరిఫికేషన్ లో జాబ్ రాకుండా పోతుందని ప్ర తి ఒక్క విద్యార్థి మంచిఆలోచనతో, మంచి అట్లా అలవాట్లు అలవర్చుకొని ఉండాలన్నారు. ఒకవేళ సైబర్ క్రైమ్ జరిగిందని భావిస్తే గంటలోపు గోల్డెన్ హౌర్ లో 1930కి కాల్ చేయా లన్నారు.

## విద్యార్థులు శ్రద్ధగా చదవాలి

**జనం పవర్ ,బైంసా, ఆగస్టు 7:** కుబీర్ మండలంలోని సాంగ్వి గ్రామంలోనీ ప్రాథమిక పాఠశాలను కుబీర్ మండల ఎంఈఓ విజయ్ కుమార్ గురువారం ఆకస్మిత తనిఖీ చేశారు. విద్యార్థుల చదువులకు ఇబ్బంది కలగకుండా ఒక టీచర్ని నియమించారు. ఎంఈఓ విజయ్ కుమార్ మాటాడుతూ.. విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు పాఠశాలను పరిశీలించడం జరిగిందన్నారు. ఇంతకుముందు ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాఠశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఎంఈఓ స్పందించి గురువారం రోజు ఒక ఉపాధ్యాయుని నియమించడం జరిగింది. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను విద్యార్థులు చక్కగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంఈఓ సూచించారు. మంచి చదువు కొని మంచి ఉద్యోగాలు సంపాదించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలని కోరారు. విద్యార్థులకు ఎంఈఓ విజయ కుమార్ బోర్డుపై పాటలను కూడా నేర్పించారు. ఈ సమావేశంలో ఎంఈఓ విజయ్ కుమార్‌తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.